జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ఈనెల 11 మరియు 14 తేదీలలో
పూలే,అంబేడ్కర్ జయంతుల సందర్భంగా
పూలే, అంబేడ్కరిస్టులు
ప్రజాపాలన దినపత్రిక కు
ప్రకటనలు ఇచ్చి సహకరించవలసిందిగా కోరుతున్నాం.
సైజ్
మొదటి పేజీ - Rs.5000/- 8x12
బ్యాక్ పేజీ - Rs.3000/- 8x10
లోపల పేజీ - Rs.2000/- 8x10
వివరాలకు ఈ క్రింది
8886022523, 9000621111, 9948725373 నెంబర్లలో
సంప్రదించగలరు.

సంపుటి 7 సంచిక 23 | హైదరాబాద్, ఏప్రిల్ 10 సోమవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు కేంద్రాలు

హైదరాబాద్,: తెలంగాణ రైతులకు సీఎం కేసీఆర్ శుభవార్త చెప్పారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సివిల్‌సప్లై శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌ను ఆదేశించారు. ప్రస్తుత యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వీలుగా తక్షణ చర్యల్లో భాగంగా సోమవారం ఉదయం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలన్నారు. రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కు కలెక్టర్లు చర్యలు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతి కుమారిని ప్రత్యేకంగా అభినందించారు. గతంలో నిర్వహించిన విధంగానే 7వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ సారి కూడా ప్రారంభించాలన్నారు. రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావాలని నిర్ధేశించారు.

**దళారులకు అగడాలకు చెక్‌పెట్టిన సీఎం కేసీఆర్..**



యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించడం ద్వారా సీఎం కేసీఆర్ ప్రయివేటు అడ్తీ వ్యాపారులు, దళారుల దోపీడికి చెక్‌పెట్టడంతోపాటు వారి దోపీడి నుంచి రైతులకు విముక్తి కల్పించారు. వడగళ్లు, అకాల వర్షాల భయానికి రైతులు ఈ యాసంగిలో వారం, పది రోజుల ముందుగానే వరికోతలు ప్రారంభించారు. ఇదే అదనుగా ప్రయివేటు వ్యాపారులు రైతుల పొలాల వద్దకే వచ్చి ట్రాన్స్ పోర్టు ఛార్జీ లేదని, ధాన్యాన్ని ఎండబోయాల్సిన అవసరం లేదని మభ్యపెడుతూ ఊళ్లలోనే క్వింటాల్‌కు రూ.1600 నుంచి రూ.1650కే కొనుగోలు చేస్తున్నారు. దాదాపు క్వింటాకు రూ.400 మేర ధర తగ్గుతున్నా వడగళు,, అకాల వర్షాల భయానికి రైతులు ప్రయివేటు వ్యాపారులకు పంటను అమ్మాల్సి వస్తోంది.

అయితే తాజాగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో రైతుల ఆర్థిక కష్టాలు దూరం కానున్నాయి. ఊళ్లోనే క్వింటా ధాన్యానికి రూ.2100 చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయనుంది.

**ఈ యాసంగిలో రికార్డుస్థాయిలో వరి సాగు**

యాసంగిలో ధాన్యం కొనుగోళ్లపై సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ప్రకటించడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. తెలంగాణలో ఈ ఏడాది యాసంగిలో గతంలో ఎప్పుడూ లేనంతగా ఏకంగా 57 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గత సంవత్సరం యాసంగిలో దాదాపు 40లక్షల ఎకరాల్లో వరి సాగు అవగా ఈ ఏడాది 17లక్షల ఎకరాల్లో అధికంగా వరిసాగు అయింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు చోట్ల యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఉంటాయా..? ఉండవా..? అని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ వినిపించిన తీపి కబురుతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఎంత లేదన్నా 1.40కోట్ల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. రైతులు తమ ఆహార అవసరాలకు దాదాపు 25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వినియోగించుకున్నా ఎంత లేదన్నా కోటి 20లక్షల టన్నుల వరి ధాన్యం దిగుబడి రానుందని అధికారులు చెబుతున్నారు.

## ఉత్తర తెలంగాణపై
# కాంగ్రెస్ ప్రత్యేక ఫోకస్..

### ఈ నెల 14న మంచిర్యాల జిల్లాలో భారీ బహిరంగ సభ



హైదరాబాద్,: ఉత్తర తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ మరింత ఫోకస్ పెట్టింది. వచ్చే ఎన్నికల్లో మెరుగైన స్థానాలు దక్కించుకోవాలనే పట్టుదలతో ఆ పార్టీ నేతలు ఇప్పటి నుంచే ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత భట్టి విక్రమార్క 'పీపుల్స్ మార్చ్ ' పేరుతో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. పాదయాత్రకు మద్దతుగా ఈ నెల 14న మంచిర్యాల జిల్లాలో దాదాపుగా లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు ఏఐసీసీ అగ్రనేతలు, రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలు కూడా హాజరుకానున్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేయడం వల్ల పార్టీ కేడర్‌లో మరింత జోష్ వస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ నేతలున్నారు. మొదటి సభ విజయవంతమైతే దాని ప్రభావం వచ్చే ఎన్నికల వరకు ఉంటుందనే భావనలో ఆ పార్టీ నాయకులున్నారు.దక్షిణ తెలంగాణ కంటే.. ఉత్తర తెలంగాణలో పార్టీ కాస్త బలహీనంగా ఉందని, భారీ సభలను ఏర్పాటు చేయవడం వల్ల కేడర్‌లో జోష్ పెరగడంతో పార్టీ పుంజుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పాదయాత్రలో భాగంగా ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, సమస్యలను బహిరంగ లేఖల ద్వారా ప్రభుత్వం దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లుతున్నారు. ఆదివాసీ గిరజన ప్రజలతో మమేకమై.. వారి సమస్యలను ఓపిగా వింటున్నారు. ప్రధానంగా పోడు భూములు, దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇస్తామన్న 3 ఎకరాల భూ పంపిణి, నిరుద్యోగ సమస్య, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్య, వైద్యం, రైతు రుణమాఫీతో పాటు సింగరేణి ప్రయివేటీకరణ అంశంపై ఎక్కువగా దృష్టి సారించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పోడు భూములను సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ఆదివాసి గిరిజనులను కాంగ్రెస్ వైపు తిప్పుకునేందుకు భట్టి విక్రమార్క ప్రయత్నం చేస్తున్నారు. అంతే కాకుండా రూ. 2 లక్షల వరకు రైతు రుణమాపీ చేస్తామని హామీ ఇస్తూనే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన సబ్‌ప్లాన్ చట్టాన్ని పూర్తిగా అమలు చేస్తామని, మహిళా సాధికారత కోసం కూడా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటామని ప్రజలకు వివరిస్తున్నారు. కాగా, మార్చి 16న ఉమ్మడి అదిలాబాద్‌లోని బోథ్ నియోజక వర్గం ఇచ్చొడ మండంలోని పిప్పిరి గ్రామం నుంచి భట్టి విక్రమార్క పాదయాత్రను మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఆదివారం వరకు పాదయాత్ర 22 రోజులకు చేరింది. ఇప్పటీ వరకు ఐదు నియోజ వర్గాల్లో బోథ్, ఖానాపూర్, అసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజక వర్గాలు పూర్తిగా కాగా, చెన్నూరు నియోజక వర్గంలో భట్టి యాత్ర కొనసాగుతుండగా.. 280 కిలోమీటర్లకు పైగా పూర్తయింది. అయితే పీపుల్స్ మార్చ్ పాదయాత్రను రాష్ట్ర వ్యాప్తంగా 40 అసెంబ్లి%n% నియోజక వర్గాల్లో 90 రోజుల పాటు సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టిన భట్టి విక్రమార్క.. మూడు బహిరంగ సభలను నిర్వహించాలని ప్లాన్ చేశారు. మొదటి సభలను మంచిర్యాల జిల్లాలో, రెండో సభ రంగారెడ్డి జిల్లాలో నిర్వహించాలని, పాదయాత్ర ముగింపు సందర్భంగా మూడో సభను ఖమ్మంలో లక్షలాది మందితో భారీగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.



## దక్షిణ అమెరికా దేశాల యూనియన్‌లో తిరిగి చేరనున్న బ్రెజిల్

బ్రసీలియా : దక్షిణ అమెరికా దేశాల యూనియన్ (ఉనాసూర్-యుఎన్ఎఎస్‌యుఆర్)లో బ్రెజిల్ తిరిగి భాగస్వామ్యం కానుంది. ఈ నెల 6వ తేదీన దీనికి సంబంధించిన ఉత్తర్వులపై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా సంతకం చేశారు. అధ్యక్షుడు లూలా హయాంలో రూపొందించిన యుఎన్ఎఎస్‌యుఆర్‌లోకి బ్రెజిల్ తిరిగి చేరుతుందని బ్రెజిల్ విదేశీ సంబంధాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మే 6వ తేదీ నుండి ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయని అన్నారు. ఉనాసూర్ ఎజెండాలో ఆరోగ్యం, మౌలికసదుపాయాలపై దృష్టి సారించడంతో పాటు వాతావరణ మార్పులకు కారణమైనచర్యలను కూడా చేర్చాలని భావించారు. మేరకు అర్జెంటీనా కూడా ఈ కూటమిలో సభ్య దేశంగా చేరుతున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండేజ్ ప్రకటించారు. 2008లో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న సమయంలో ఈ ఉనాసూర్ స్థాపించబడింది. సమన్వయం కూటమిలో ఉనాసూర్‌లో ప్రస్తుతం బలీవియా, గయానా, సురినామ్, మెనిజులా క్రియాశీల సభ్యులుగా ఉన్నాయి. పెరూ సస్పెండ్ చేయబడింది. 2010లో ఈ బృందం 12 దక్షిణ అమెరికా దేశాలకు విస్తరించింది.

# బండిపుర టైగర్ రిజర్వ్‌లో పర్యటించిన మోడీ



బెంగళూరు : 'ప్రాజెక్ట్ టైగర్' 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ప్రధాని మోడీ కర్ణాటకలోని బండీపుర టైగర్ రిజర్వును సందర్శించారు. సుమారు 20 కిలోమీటర్లు జీప్‌లో పర్యటించారు. అనంతరం తెప్పకాడు ఎలిఫెంట్ క్యాంప్‌ను సందర్శించి.. ఏనుగులకు చెరకుగడలను ఆహారంగా ఇచ్చారు. ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్న 'ఎలిఫెంట్ విష్పరర్స్' డాక్యుమెంటరీలో కనిపించిన బొమ్మన్, బెల్లి దంపతులను కలిసి మాట్లాడారు. అనంతరం మైసూరులోని కర్ణాటక ఓపెన్ యూనివర్శిటీ (కెఎస్ఒయు)లో ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవనున్నారు. దేశవ్యాప్తంగా వన్యప్రాణుల పురోగతిని చూపించే వాక్ ఇన్ ఎగ్జిబిషన్‌ను సందర్శించనున్నారు.పులుల బండీపుర అభయారణ్యం- టైగర్ ప్రాజెక్టు స్వర్ణ మహోత్సవాలను ప్రారంభించేందుకు ప్రధాని శనివారం రాత్రి మైసూరుకు చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని పర్యటన నేపథ్యంలో మైసూర్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 9 వరకు పర్యాటకులను టైగర్ రిజర్వ్ లోకి అధికారులు అనుమతించడం లేదు. జాతీయ రహదారి 181పై వాహనాల రాకపోకలను మూసేశారు. ప్రాజెక్ట్ టైగర్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక నాణేన్ని విడుదల చేయనున్నారు. 'అమృత్ కాల్' సందర్భంగా పులుల సంరక్షణ కోసం ప్రభుత్వ విధానాలను ప్రధాని మోడీ విడుదల చేయనున్నారు. ప్రాజెక్ట్ టైగర్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక నాణేన్ని విడుదల చేయనున్నారు.

# పైరవీలకు అడ్డాగా కార్యాలయాలు: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు, మున్సిపల్.. రెవెన్యూ కార్యాలయాలు పైరవీకారులకు అడ్డాగా మారాయంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని నార్సింగి, మంచిరేవుల, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తెచ్చి పెడుతున్నా.. ఆయా ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. చెరువులు, భూముల కబ్జాలు జరిగినా పట్టింపు లేదన్నారు. చివరకు పేదల పిల్లలు కుక్కలబారిన పడి చనిపోయినా పట్టించుకోని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం రేవంత్ సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆదాయం వచ్చే పనులు తప్ప ప్రజలకు మేలు జరిగే పనులను సీఎం కేసీఆర్ చేయబోడని, ఇక ఆయనను గద్దె దించాల్సిందేనని అన్నారు. ఈసారి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసి.. అండగా నిలిచిన వారిని పార్టీ గుర్తు పెట్టుకుంటుందని, అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ అధికారిక కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొనక పోవడం తెలంగాణ రాష్ట్రానికి నష్టమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ, విభజన హామీలు తదితరాల గురించి మాట్లాడే అవకాశం కోల్పోయారని అన్నారు.

పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
E-mail : ambedkarrajaneethimovement@gmail.com website : www.puleambedkarrajyadhikarasamithi.com

ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటునారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్ధించు కుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాగుదాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

ప్రధాన ఆశయాలు

సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి కదలి రండి.

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్య కులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లి మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లికి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.
5. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లీం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ, బుద్ధిస్టులకు సేపరేట్ ఎలక్టోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.
6. సమతా కులం : కులాంతర వివాహం చేసుకున్న వారి యొక్క పిల్లలకు సమతా కులంగా నామకరణం చేస్తే ప్రభుత్వం అంగీకరించాలి. ఆ నవ తరానికి ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాలలో ప్రాముఖ్యత ఇవ్వాలి మరియు వారి తల్లిదండ్రులకు ప్రాముఖ్యతతో కూడిన రక్షణ కల్పించాలి. తద్వారా 150 సంవత్సరాలలో అంబేడ్కర్ కోరుకున్న కుల రహిత సమాజాన్ని చూడవచ్చు.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్క ప్రతిపాదనను అంగీకరించినా... వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా http://www.puleambedkarrajyadhikarasamithi.com/ వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించు కునేందుకు రండి.. కదలి రండి...

కమిటీల నిర్మాణం

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.
ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.
అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది
Contact No : 7660027683

# ఆమ్ ఆద్మీ పార్టీ బస్తీ బాట



మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 08, ప్రజాపాలన: మంచిర్యాల ఆమ్ ఆద్మీ పార్టీ బస్తీ బాట కార్యక్రమం 16వ రోజులో భాగంగా నస్పూర్ మున్సిపాలిటీ లోని తొమ్మిదో వార్డులో ఆదివారం రోజు పర్యటించారు. ఈ సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ నయీమ్ భాష మాట్లాడుతూ వార్డుల్లో కొన్ని లైన్ల కు సంబంధించి రోడ్లు డ్రైనేజీ కరెంటు లైన్ ఫెసిలిటీ లేదు మిషన్ భగీరథ వాటర్ చాలా మురికిగా వస్తున్నా కూడా కౌన్సిలర్ పట్టించుకోవడం లేదని అన్నారు. ఉన్న వాటర్ ట్యాంకు లోపల చెట్లు బురదతో నిండి ఉంది కాంపౌండ్ వాల్ విరిగిపోయి సంవత్సరాలు గడుస్తున్నా కూడా పట్టించుకోవడం లేదని దీనితో పందులు పాములు రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు కౌన్సిలర్ చైర్మన్ ల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేసినా కూడా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే సింగరేణి యాజమాన్యం మున్సిపాలిటీ వారు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సర్పన్ పల్లిలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



వికారాబాద్ బ్యూరో 09 ఏప్రిల్ ప్రజాపాలన : వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్ పల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆయన చదువుకునేటప్పుడు ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడని పేర్కొన్నారు. చదువు వలన మనిషికి విలువ వస్తుందని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వలన ప్రతి ఒక్కరు ప్రస్తుతం సంతోషంగా జీవిస్తున్నారని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని ఆయన అందరివాడు అని చెప్పారు. దేశంలోని ప్రతి ఒక్కరు ఆర్థిక సామాజిక రాజకీయపరంగా ఎదగాలని అసమానతలు లేని సమాజం నిర్మాణం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్సవ కమిటీ చైర్మన్ జగదీష్, ప్రధాన కార్యదర్శి నర్సింలు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మహిపాల్, మేధావుల ఫోరం అధ్యక్షులు దేవదాసు,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్ళపల్లి రమేష్, బిఆర్ఎస్ కేవి జిల్లా అధ్యక్షుడు భూమోల్ల కృష్ణ, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ తిమ్మని శంకర్,ఎమ్ఎస్ పి జిల్లా కో ఆర్డినేటర్ పి.ఆనంద్,అంబెడ్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనంద్,జిల్లా మహనీయుల కమిటీ అధ్యక్షుడు జగదీష్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల కనీస వేతనం 21వేలకు పెంచాలి



చేవెళ్ల ఏప్రిల్ 9, (ప్రజాపాలన): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజవర్గంలోని శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ శంకర్ పల్లి పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉండడం కోసం మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నరని అన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీసం గ్లౌజ్ లు, బుట్లు, గుర్తింపు కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికులకు వాటితో పాటు, నాణ్యమైన సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా మున్సిపల్ కార్మికులకు నెలకు 21,000 రూ,,ల జీతం, 5 లక్షల భీమా ఇవ్వాలని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని యెడల తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బిసొల్ల రమేష్, కోశాధికారి రాములు, ఉపాధ్యక్షులు శాంతయ్య, కృష్ణ, మున్సిపల్ కార్మికులు లక్ష్మీ, రాజు,.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వామపక్షాల ఐక్యతతోనే దేశం రక్షించబడుతుంది

**సిపిఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్**



ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 9 (ప్రజాపాలన,ప్రతినిధి) : వామపక్షాల ఐక్యతే దేశానికి రక్ష అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర మీటింగ్ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఐ సిపిఎం పార్టీల రాష్ట్రస్థాయి సమావేశానికి ఆసిఫాబాద్ జిల్లా నుండి సిపిఎం కార్యదర్శి దుర్గం దినకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆర్ఎన్ఎస్ సిద్ధాంతానికి అనుగుణంగా పాలన కొనసాగిస్తుందన్నారు. మతోన్మాదాన్ని ప్రజల మధ్యలో వైశాల్యాలను పెంచుతుందని, దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను, అంబానీ, ఆధానీలకు, దోచిపెడుతుందన్నారు. కోట్ల మంది ప్రజలకు ఇచ్చే రాయితీలు కానీ, ఉపాధి అవకాశాలు కానీ, ఇచ్చే రాయితీలు చాలా తక్కువ అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చేనాటికి ఆదాని పేరు ఎవరికి తెలియదని,నేడు ఇన్ని ఆస్తులు ఇలా కూడపెట్టారో ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ పాలన కూడా అంతంత మాత్రమేనని, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎర్రజెండాల వల్లనే దేశం రక్షించబడుతుందని, రాష్ట్రంలో ఈరోజు సిపిఎం సిపిఐ ల ఉమ్మడి మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పోలీస్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజు, నారాయణులు, హాజరయ్యారని తెలిపారు.

## ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు నందిని విక్రమార్క



మధిర, ఏప్రిల్ 9 ప్రజా పాలన ప్రతినిధి: మధిర పట్టణంలోని జామియా మసీదు వద్ద ఆదివారం ముస్లిం సోదరుల పవిత్ర మాసమైన రంజాన్ పండుగ ఉపవాస దీక్ష విరమణ ఇఫ్తార్ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల పవిత్రమైన పండుగ రంజాన్ పండుగని ఈ నెల మొత్తం కఠిన ఉపవాస దీక్ష చేసి ఆ అల్లాని వేడుకుంటారని అన్నారు.. ఇఫ్తార్ విందులో పాల్గొనడం అల్లా ప్రసాదించిన వరమని, ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అందరికీ శుభాలు కలగాలని, ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ ,మున్సిపాలిటీ కౌన్సిలర్ కోన ధని కుమార్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జహంగీర్ ,మైనార్టీ నాయకులు సయ్యద్ రషీద్, నూర్ మహమ్మద్, బాజీ రబ్బాని, మహబూబ్, జమీల్ పాషా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధారా బాలరాజు కాంగ్రెస్ నాయకులు నిడమనూరు వంశీకృష్ణ బిట్రా ఉద్దండయ్య పులిబండ్ల చిట్టిబాబు ఆదిమాల శ్రీనివాసరావు ముస్లిం సోదరులు మొదలగు వారు పాల్గొన్నారు.

## పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ సురేష్ కుమార్**

**మైనారిటీ పోలీస్ సిబ్బందికి ఇఫ్తార్ విందు**



ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 9 ప్రజా పాలన (ప్రతినిధి) : పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కే.సురేష్ కుమార్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకునేలా ప్రభుత్వం తరపున పోలీసుల తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పండగలు మతసామరస్యానికి ప్రతీకలని, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా గురజాడ చెప్పిన మాటలను మతాలన్నీ మాసిపోవును జ్ఞానం ఒక్కటే నిలిచి పోతాయని గుర్తు చేశారు. రంజాన్ మాసంలో కొనసాగించిన నియమనిష్టలు నిరంతరం సాగించాలన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని మైనారిటీలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి (అడ్మిన్) అచ్చేశ్వర్ రావు, ఏఎస్పీ (ఎ ఆర్) భీంరావు, డిఎస్పిలు శ్రీనివాస్, కరుణాకర్, సిఐ లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈస్టర్ వేళ ఆనందాలు పంచిన మోదీ



న్యూఢిల్లీ: ఈస్టర్ వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆనందాలు పంచారు. న్యూఢిల్లీలోని సేక్రెడ్ హార్ట్ క్యాథెడ్రాల్ క్యాథలిక్ చర్చ్ సందర్శించారు. ప్రధానికి బిషప్ అనిల్ ఖుటోతో పాటు ఇతర క్రైస్తవ మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చర్చ్ ఆవరణలో మోదీతో మొక్క నాటించారు. చర్చ్‌లో క్యాండిల్ వెలిగించడంతో పాటు మోదీ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు ఆయనకు బహుమతిని కూడా అందించారు. దేశ ప్రధాని ఒకరు తమ చర్చ్‌కు రావడం ఇదే తొలిసారి అని బిషప్ అనిల్ తెలిపారు. ప్రధాని రాక తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. ప్రధానితో ఫాదర్లు ఫొటోలు దిగారు.

# వలస ఆపిన దళితబంధు.. దళిత కుటుంబాల్లో సరికొత్త కాంతులు..

హైదరాబాద్, ఏప్రిల్ 9 : అణగారిన వర్గాల అభ్యున్నతిని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కలగన్నారు. అందుకోసం జీవితపర్యంతం కృషి చేశారు. స్వతంత్ర భారతదేశంలో ఆయన కలలను సాకారం చేస్తున్న ఏకైక వ్యక్తి, శక్తి తెలంగాణ సీఎం కేసీఆర్. అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు కేసీఆర్. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో అట్టడుగు వర్గాలు అభివృద్ధి బాటపట్టాయి.స్వరాష్ట్రం ఏర్పడేదాకా వలసల జిల్లాగా పేరుపొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు దళితుల జీవితాల్లో వెలుగు ప్రసరించింది. వలసలు వదిలి స్థానికంగానే ఉపాధి చూసుకుంటున్నారు. ఒకనాడు చీప్ లేబర్‌గా పాలమూరు కూలీల చెమట కారుచౌక.. నేడు అదే కూలీలు యజమానులవుతున్నారు. ఆర్థిక స్వావలంబనతో ఆత్మగౌరవానికి ప్రతీకగా వెలుగుతున్నారు. పై చిత్రంలోని వ్యక్తి పేరు ఈర్లపల్లి వెంకటయ్య. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల. తండ్రి సాయిలు, తల్లి పెంటమ్మ. ఇద్దరూ అనారోగ్యంతో కన్నుమూశారు. అన్నలు, అక్క పెంచి పెద్దచేశారు. ఆస్తులేమీ లేవు. వారి జీవనాధారం రెక్కల కష్టమే. వెంకటయ్య ఎలాగో లా ఓపెన్‌లో టెన్త్ పూర్తిచేశాడు. ఆర్థిక స్థోమత లేక 15 ఏండ్లకే పొట్టచేతపట్టుకొని హైదరాబాద్ వలసొచ్చాడు. తాపీ పని, టైల్స్, గ్రానైట్ పరిచే పనికి వెళ్లాడు. కాలం మారుతున్నా బతుకు మారలేదు. ఆదాయం పెరుగలేదు. నెలకు కూలీ ద్వారా వచ్చే రూ.15 వేలు పొట్టకుబట్టకూ సరిపోని దుస్థితి. చేసేదేమీలేక 2009లో స్వగ్రామం చేరుకొన్నాడు. ఓ రోజు ఉదయం పనికి వెళ్తుండగా ప్రమాదం బారినపడ్డాడు. వైద్యులు మోకాలి పైవరకు కాలును తొలగించారు. అప్పటి నుంచి ఇంటికే పరిమితమయ్యాడు. అన్నదమ్ములు, అక్క ఆదరణతో బతుకు ఈడ్చుకుంటూ వచ్చాడు. 2015లో నీలమ్మతో పెళ్లి జరిగింది. పాప జశ్విక, బాబు జైషు పుట్టారు. భార్య రెక్కల కష్టంపైనే ఇల్లు గడిచేది. 'గోరుచుట్ట మీద రోకలిపోటు'లా పాపకు బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. అప్పుచేసి వైద్యం చేయించినా పాప దక్కలేదు. దుఃఖాన్ని దిగమింగుతూ రోజులను గడుపుతున్న క్రమంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన 'దళితబంధు' అతని జీవితంలో వెలుగులు నింపింది. అతడి విధిరాతను మార్చింది. మంచానికి పరిమితమైన వెంకటయ్యను యజమానిని చేసిం ది. దళితబంధు సాయంతో 4 నెలల క్రితం కల్వకుర్తిలో గ్రానైట్ షాపు పెట్టుకొన్నాడు. మార్బుల్స్ విక్రయంతోపాటు వాటిని పరిచే కాంట్రాక్టును నిర్వహిస్తున్నాడు. ఇప్పుడు ఖర్చులన్నీపోగా నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నాడు. అప్పులు తీర్చా డు. ప్రస్తుతం ఇంటి అవసరాలు పోగా మిగిలిన ఆదాయాన్ని తిరిగి షాపులోనే పెట్టుబడిగా పెడుతున్నాడు. షాపును మరింతగా విస్తరించే దిశగా ముందుకు సాగుతున్నాడు. ఇది వెంకటయ్య ఒక్కడి విజయగాథ కాదు. నాడు వలసపోయిన అనేక మంది పాలమూరు బిడ్డలు దళిత బంధు దన్నుతో నేడు సాగిస్తున్న విజయయాత్ర. సీఎం కేసీఆర్ అందిస్తున్న ఆర్థిక అండతో దశాబ్దాల కలలను సాకారం చేసుకొంటూ, ఆత్మగౌరవంతో జీవనం సాగిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకొంటూ దళితులు రచించుకొంటున్న కొత్త చరిత్ర. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కథనం..

తెలంగాణ ఏర్పడే నాటికి వలసలకు చిరునామాగా వాసికెక్కింది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా. జనాభాలో సగానికిపైగా మంది వలసపోయేవారంటే పాలమూరు పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అందులోనూ దళితుల పరిస్థితి మరింత అధ్వానం.. దయనీయం. ఒకవైపు ఉద్యోగాలు లేవు. ఉత్పత్తి యంత్రాలూ సొంతం కావు. సాగుభూమి సంగతి అంతే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధిక శాతం దళితులకు రెక్కల కష్టమే జీవనాధారం. మరోవైపు సాగునీరు కరువై.. పంటలు లేక, ఉపాధి లేక హైదరాబాద్, ముంబై, పుణె.. ఇలా దేశ నలుమూలలకు వలసపోవడమే జీవనవిధానంగా మారిన విషాదం. ఏండ్లకేండ్లుగా అడ్డా కూలీలుగా, గుంపు మేస్త్రీలుగా, డ్రైవర్లుగా, క్లీనర్లుగా బతుకులు ఈడ్చడమే తప్ప సొంతంగా వ్యాపారాలను నిర్వహించేందుకు అవకాశాలు.. అంతమేర ఆర్థిక స్థోమత లేని దైన్యస్థితి. సూటిగా చెప్పాలంటే ఎక్కడ పనిదొరికితే అక్కడికి శాశ్వతంగా వలసపోయేవారు కొందరైతే, ఏడాదిలో సగానికిపైగా రోజులు తాత్కాలికంగా సమీప పట్టణాలకు వలసపోయేవారు మరికొందరు. ఇప్పుడు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం పాలమూరు దళిత వలస కూలీల జీవితాల్లో కొత్త వెలుగులను నింపుతున్నది. సొంత ఊరిలో ఆత్మగౌరవంతో జీవనం సాగించేలా తీర్చిదిద్దుతున్నది.

70 శాతానికిపైగా వలసకూలీలే లబ్ధిదారులు

తెలంగాణ సర్కారు దళితబంధు పథకం అమలుకు రాష్ట్ర నలుదిక్కులనుంచి నాలుగు మండలాలను ఎంచుకోగా అందులో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని చారకొండ మండలం ఒకటి. 2011 జనాభా లెకల ప్రకారం మండలంలో మొత్తంగా దళిత సామాజికవర్గానికి చెందినవారు 4,176 మంది ఉండగా, 1,242 ఇండ్లు ఉన్నాయి. అందులో అదనంగా మరో 15 వందలకుపైగా జనాభా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని దళిత సామాజికవర్గం ఎకువగా వ్యవసాయ కూలీలుగానే జీవనం సాగిస్తున్నారు. మరికొంతమంది హైదరాబాద్, ముంబై, పుణె, సోలాపూర్, గోవా, కర్ణాటక తదితర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టడంతో వారి జీవితమే మారిపోయింది. మండలంలోని 1,407 దళిత కుటుంబాలకు దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసింది. నియోజకవర్గానికి 100 చొప్పున మరో 1,199 దళిత కుటుంబాలకు మొత్తంగా 2,606 కుటుంబాలకు దళిత బంధు అమలు చేసింది. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేసింది. లబ్ధిపొందిన దళిత కుటుంబాల్లో 70 శాతానికిపైగా మంది కనీసం తాత్కాలికంగానైనా ఉపాధి కోసం వలసపోయినవారే ఉండడం విశేషం.

స్వగ్రామంలో రెండుచేతులా సంపాదన

నాడు పనిలేక వలసబాట పట్టిన దళిత కుటుంబాలకు దళితబంధు వరంలా మారింది. పూర్తిస్థాయిలో ఆర్థిక ప్రగతి సాధించేందుకు బాటలు వేస్తున్నది. రోజు కూలీపనికి వెళ్లిన దళితులు ఇప్పుడు యజమానులుగా మారుతున్నారు. కొడవలి పట్టి కోతలు కోసిన చేతులే ఇప్పుడు సర్కారు ఆర్థిక దన్నుతో కోతయంత్రాలను అందిపుచ్చుకొంటున్నాయి. నెలజీతానికి స్టీరింగు పట్టి బతుకులీడ్చుతున్న డ్రైవర్లు సొంత వాహనాలను కొనుక్కొంటున్నారు. ఒక్కమాట లో చెప్పాలంటే యంత్ర పరికరాలు కూలీ రెక్కలకు చేరువవుతున్న దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. అందుకు చారకొండ మండలంలోని దళితబంధు లబ్ధిదారుల జీవితాలే నిదర్శనం. ఇతర ప్రాంతాలకు వలసపోయి ఏండ్లు గా తాము చేసిన వృత్తులకు సంబంధించిన యూనిట్లను సొంతంగా ఏర్పాటు చేసుకొంటూ, సమర్థంగా వ్యాపారాలు చేస్తున్నారు.

## ఆర్ సీ ఎం చర్చి లో ఘనంగా క్రీస్తు పునరుత్థాన మహోత్సవం



అశ్వరావుపేట ప్రజా పాలన ప్రతినిధి అశ్వరావుపేట మండలంలోని స్థానిక గుడ్ న్యూస్ స్కూల్ ఆవరణంలో ఉన్న ఆర్ సీ ఎం చర్చిలో క్రీస్తు పునరుత్థాన మహోత్సవాన్ని ఫాదర్ జోషి, ఫాదర్ టోనీ ప్రసన్న గారి ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి పూజలు చేసి కొత్త వెలుగు ,కొత్త నీరు తయారుచేసి అందరూ కూడా కొవ్వొత్తులు వెలిగించుకొని క్రీస్తు పునరుత్థానాన్ని ఆహ్వానిస్తూ పూజలో పాల్గొన్నారుఈ సందర్భంగా ఫాదర్ టోనీ ప్రసన్న మాట్లాడుతూ ప్రజలందరి కొరకు క్రీస్తు మరణించి మూడవ నాడు పునరుత్థానమైన రోజున ఈస్టర్ పండుగగా కొనియాడతారని, కొత్త వెలుగు అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, అందరూ కూడా క్రీస్తు మార్గంలో నడవాలని ఆయన కోరారు. పలు చర్చిలలో కూడా క్రీస్తు పునరుత్థాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి గుడ్ న్యూస్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ డెల్ఫీ సిస్టర్ రోస్లీ చర్చి పాస్టర్లు డి చార్లెస్ ,జోసెఫ్, డి శ్యాంసుందర్, డేవిడ్ పాల్ ప్రభావతి గార్లు సంఘ పెద్దలు జుజ్జూరపు రాంబాబు,యన్ రవీంద్ర,బి రమాదేవి, జె అప్పారావు, వి పార్వతి, టి నిర్మలమ్మ,వై రాములమ్మ ప్రసాదు,యన్ మధు, అచ్చుతాపురం, పేరాయి గూడెం, నెహ్రూ నగర్, అనంతరం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎర్రుపాలెం మండల బిఆర్ ఎస్ కార్య నిర్వహణ కార్యదర్శిగా గొల్లపూడి యాకోబు



ఎర్రుపాలెంఏప్రిల్ 9 ఆదివారం ప్రజా పాలన ప్రతినిధి ఈరోజు మండల పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన గొల్లపూడి యాకుబు మండల టిఆర్ఎస్ కార్య నిర్వహణ అధికారిగా మండల అధ్యక్షులు పంబి. సాంబశివరావు,మరియు కార్యదర్శి యన్నం శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు ,ఆదేశాల మేరకు. మధిర వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చావ రామకృష్ణ కృషితో స్థానిక ఎర్రుపాలెం మండల పార్టీ కార్యాలయంలో ఎన్నుకోవడం జరిగింది . ఈ సందర్భంగా గొల్లపూడి యాకోబు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాయకులు చావ రామకృష్ణ , పంబి.సాంబశివరావు ,నాకు ఈ పార్టీ పదవి అప్పజెప్పినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గ్పార్టీ కట్టుబాట్లకు విధేయుడనై ఉంటానని.నాయకుల ప్రోత్సాహంతో ముందు ముందుకు సాగుతానని అందరి ప్రోత్సాహం తోడ్పాటు , అండదండలు మెండు గా ఉండాలని వాగ్దానం చేస్తున్న. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సద్గుర్తి.కిషోర్ బాబు ,మండల కమిటీ సభ్యులు దేవరకొండ రవి ,ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనపనూరి భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ కాపు వరప్రసాదరావు, తోటపల్లి బాలరాజు, మల్లవరపు బాలాజీ ,వెంకటరత్నం, ముఖ్య నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఇంటింటికి ప్రచారం



బీరుపూర్, ఏప్రిల్ 09 (ప్రజపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి మహంకాళి రాజన్న మాట్లాడుతూ 2004 లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగంల్లో విద్య వైద్య గూడు నీడ తదితర సంక్షేమ పథకాలను అమలు పరచి అన్ని రంగాల్లో మరియు ఒక లక్ష 70 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి అందించేవారని గుర్తు చేశారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం టీఎస్ పిఎస్ పేపర్ లీకేజీ అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలుగు హిందీ పేపర్ లికేజీలు చేసి విద్యార్థుల జీవితాలతో అటాడుకుంటున్న ప్రభుత్వలను ప్రజలు వెంటనే గద్దె దించాలని రాజన్న ధ్వజమెత్తారు. తెలంగాణలో ఉన్న ఎన్టీఆర్ చంద్రబాబు అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలే అని గురుకుల ఆశ్రమ పాఠశాలు వెల్ఫేర్ హాస్టల్స్ ఇంజనీరింగ్ కాలేజీలు అంగన్వాడి భవనములు సిమెంట్ రోడ్లు ప్రతి కిలోమీటర్లు ప్రాథమిక పాఠశాల జూనియర్ కాలేజ్ ప్రతి డివిజన్ కు ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం పార్టే అని రేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు పక్కా ఇల్లు ఉచిత విద్యుత్ తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో జరిగాయని పేర్కొన్నారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు సుర్వి సంతోష్ రావు కటిక రెడ్డి ప్రభాకర్ సంద్రపు విజయ్ కుమార్ బత్తుల కొండయ్య నక్క లక్ష్మణ్ పాల్గొన్నారు.

# వేలకోట్లు ఎలా సంపాదించావో ప్రజలకు సమాధానం చెప్పు..

**తల్లాడలో విలేకరుల సమావేశంలో పిడమర్తి రవి..**



తల్లాడ, ఏప్రిల్ 9 (ప్రజా పాలన న్యూస్):సీఎం కేసీఆర్ తో మాట్లాడి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని నీకు రెన్యువల్ చేయిస్తా.. హైదరాబాద్ పో అని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నా కాళ్లు పట్టుకుంటేనే నేను అక్కడికి వెళ్లానని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా తల్లాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పటి నియోజకవర్గ ఇన్చార్జ్ నూకల నరేష్ రెడ్డి, మువ్వ విజయబాబు సమక్షంలో సండ్ర నాకు పదవి రెన్యువల్ చేయిస్తానని కాళ్లు పట్టుకుంటేనే హైదరాబాద్ వెళ్లానన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ కోసం అనేకసార్లు జైలుకు వెళ్లానని గుర్తుచేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఏఈలు, డీఈలు నాకు తెలియదని అంటున్నావుగా నీలాగా నేను కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లు తీసుకోనని ఆరోపించారు. ఒకప్పుడు నీ ఆస్తులెంతా..? నీ పరిస్థితి ఏంది.. ఇప్పుడు నీ ఆస్తులెంతని ప్రశ్నించారు. హైదరాబాదు, ఆంధ్ర, బెంగుళూరు, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో ఇల్లు, ప్లాట్లతో పాటు వేల కోట్లు ఎలా వచ్చాయన్నారు. ఎన్నికల్లో నేను పోటీ చేసేటప్పుడు నా పార్టీ వాళ్ళను మాత్రమే అడిగానని, నీలాగా అన్ని పార్టీల దగ్గరకు వెళ్లి అడగలేదన్నారు. పగులు సంసారం, రాత్రి వ్యభిచారం లాగా నేను చేయలేదన్నారు. ఓటుకు నోటు కేసులో పట్టపగలే దొరికిన దొంగవి నువ్వు అన్నారు. అన్ని పార్టీల నాయకులను మోసం చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. మరోసారి తనపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన ఘాటుగా హెచ్చరించారు. అనంతరం సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్, నాయకులు గణేశుల రవి, యర మల వెంకటేశ్వర్ రెడ్డి, మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి రమేష్, తూము వెంకటనారాయణ, ఎర్రి నరసింహారావు, రాఘవరెడ్డి, పొట్రు శ్రీనివాసరావు, మాగంటి శ్రీను, గోవిందు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ తోనే సంక్షేమ పాలన సాధ్యం

**ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**



మేడిపల్లి, ఏప్రిల్ 9 (ప్రజాపాలన ప్రతినిధి) :సీఎం కేసీఆర్ తోనే సంక్షేమ పాలన సాధ్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు.రామంతాపూర్ డివిజన్ ఇందిరా నగర్ లోని పద్మశాలి భవన్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, రామంతాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ముస్తాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన 8 సంవత్సరాలలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టనీ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి ప్రతీ కాలనీలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటిలోను కనిపిస్తున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అజేయ విజయాన్ని సొంతం చేసుకొని మూడోసారి సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి రావటాన్ని ఏ శక్తి ఆపలేదని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకం అని, పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనం పల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, రేపాక కుమారస్వామి,తిప్పని సంపత్, ప్రధాన కార్యదర్శి జేసిబి రాజు, రహమాన్, సీమ అశోక్, జంగయ్య ,మహేందర్, గుండం మధు, రత్నం, డాన్ శీను , జక్రియ, బాలకృష్ణ, నారాయణస్వామి ప్రశాంత్, అద్వైత్ రెడ్డి, కిట్టు , అశోక్, డి.జే సాయి, అద్వైత్ రెడ్డి, భాగ్యరేఖ, మంజుల , పద్మ , సబిత , మహిళలు నాయకులు, కార్యకర్తలు, మహిళలు,పార్టీ శ్రేణులు , కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో మాల మహానాడు పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం ఏప్రిల్ 09 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద మాల మహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాల,మాల ఉపకులాల ఆత్మగౌరవ సమ్మేళనం అనే వాల్ పోస్టర్ ను మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య ఆవిష్కరించారు. ఈనెల 12న మండల కేంద్రంలో నిర్వహించే ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా మాల మహానాడు జాతియ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ హాజరవ్వనున్నారని, మండలంలోని మాల మాల ఉపకులాల ప్రజలు హాజరు కావాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాడే శంకర్, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, మాల మహానాడు పార్లమెంటరీ ఇంచార్జ్ బోలుమల్ల సదానందం, కార్యనిర్వాహణ అధ్యక్షుడు గరిగే ప్రభాకర్, మండల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు .

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం



వికారాబాద్ బ్యూరో 09 ఏప్రిల్ ప్రజాపాలన : 5 వేల కోట్లతో చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ప్రతీ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్య భారతి ఫంక్షన్ హాల్ లో రెడ్ల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించగా రెడ్డి బంధువులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పిట్ట శ్రీనివాస్ రెడ్డి,పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో రెడ్లకు,వైశ్యులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రులను, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్పొరేషన్‌ను సాధించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పూలే జీవితం యువతకు ఆదర్శం

**పి డి ఎస్ యూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్**



చేవెళ్ల ఏప్రిల్ 9, (ప్రజాపాలన):మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న ప్రగతిల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే ఫొటోస్ ని మండల కేంద్రంలోని అన్ని కార్యాలయాలలో ఉంచాలని బహుకరించారు.ఈ సందర్భంగా పి డి ఎస్ యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్. మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలె పుట్టిన కాలంలో శూద్ర, అతిశూద్రుల పిల్లలు పుట్టిన తేదీలు తెలియకుండా పోయిందన్నారు.పూలే జననం 1827 ఏప్రిల్ 11న జన్మించాడని చెప్పటానికి ఆధారం ఆ రోజు పేష్వా రాజుల రాజమహల్ మంటల్లో కాలిపోయిన సంఘటనతో ఇతని ముడిపడి ఉంది. బ్రాహ్మణ వర్గాల వారు దానిని గుర్తుంచుకున్న కాబట్టి అందరికీ తెలిసింది. జ్యోతిబా జననం రోజునే యాదృచ్ఛికంగా పీష్వాల రాజమహల్ తగులబడటం. ఇది పీష్వా బ్రాహ్మణుల అమానుషత్వానికి అంతిమ సంకేతం. పౌరుషానికి ప్రతిరూపం పూలే పూర్వీకులు వారి స్ఫూర్తితో ఇతను అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడు. 1873 సెప్టెంబరు 24న, పులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశాడు. అని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు. అని లాగ్రెంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో ఫులే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడదని, అతను, అతని భార్య సావిత్రిబాయి ఫులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడు. ఫులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడు. అతను వితంతువుల కోసం ఒక ఆశ్రమాన్నీ కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి వ్యక్తి విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంఘ సంస్కర్త కూడా ఆయనే అని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో పిడిఎస్ యు నాయకులు : అఖిల్, సంతోష్, శ్రీను, ప్రభాస్, రాజు తదితరులు ఉన్నారు.

## శంకరపట్నంలో దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



శంకరపట్నం ఏప్రిల్ 09 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలను టిడిపి మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఆరిఫ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో దామోదర్ రెడ్డి కరీంనగర్ జిల్లా టైగర్ గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండి సాబీర్, గోపు వీరమల్లు, ఊకంటి మధుకర్ ,గుర్రం బుచ్చయ్య, బొంగోని చందు, బైరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి [PARS]

డియర్ లీడర్స్

సిడబ్ల్యుసి మెంబర్స్, స్టేట్ కోఆర్డినేటర్స్,స్టేట్ కమిటీ,అధికార ప్రతినిధి, మరియు లీడర్స్.

- బహుజన రాజ్యాధికార సాధనకు (MAM ) మామ్ సూత్రం తో ముందుకెళ్తున్న విషయం మీ అందరికీ తెలుసు
- ఈ (MAM )మామ్ సూత్రాన్ని అధిగమించడం కోసం 175 మంది వాలంటీర్స్ ను విద్య మరియు వయసుతో సంబంధం లేకుండా నియమిస్తున్నాం

ఒక్కొక్క వాలంటీర్ కు 25,000 రూపాయలు రెండు నెలలు చెల్లించడం జరుగుతుంది

వాలంటీర్స్ చేయవలసిన పని

వారు రెండు నెలల కాలంలో చేయవలసిన పనులు

1. ఏ పార్టీలో లేని బహుజన నాయకుల పేర్లు ఫోన్ నెంబర్ ఇవ్వాలి.
2. పార్స్ ఆశయాలకి మద్దతుగా Minimum 500 సంతకాలు చేపించాలి.
3. 500 మద్దతు దారులలో కనీసం 5 గురిని ఇండిపెండెంట్ మీడియా ఓనర్ గా చేర్పించాలి.

సిడబ్ల్యుసి మెంబర్స్, స్టేట్ కోఆర్డినేటర్స్ , స్టేట్ కమిటీ, స్పోక్స్ పర్సన్స్ మరియు నాయకుల ఆధీనంలో పని చేయాలి.

డా.కె శివ భాగ్య రావు బహుజన్, IRS-vrs
నేషనల్ కన్వీనర్

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

సోమవారం 10, ఏప్రిల్ 2023

# మోదీకి దీటైన పోటీదారు ఎవరు?

మహాశక్తిశాలి ఒకడు, సవాలుదారులు పలువురు! భారత రాజకీయాలలో చాలా కాలంగా ఒక పోటీ నడుస్తోంది. అదే 'కౌన్ బనేగా ఛాలెంజర్' (కేబీసీ). ప్రతీ సంవత్సరం (కొన్ని సందర్భాలలో ప్రతీ కొద్ది నెలలకూ) కొత్త పోటీదారులు ప్రభవిస్తుండగా ఇతరులు నిష్క్రమిస్తుంటారు. సరే, తదుపరి సార్వత్రిక ఎన్నికలకు ఇంకా పన్నెండు నెలల వ్యవధి ఉన్నది. ఈ నేపథ్యంలో కేబీసీ బహుశా, అత్యంత ఆసక్తికరమైన దశలోకి ప్రవేశించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సమర్థంగా ఎదుర్కొనే ఒకే ఒక్క పోటీదారు ప్రభవిస్తాడా? లేక విపక్షాలు సమష్టిగా ఆ పోరాటానికి పూనుకుంటాయా? 2021లో మమతా బెనర్జీ సంభావ్య కేబీసీ ఫైనలిస్ట్ (చివరి పోటీకి నిలిచిన యోధ)గా వెలుగొందారు. ఆ ఏడాది ఆమె బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో అత్యంత ప్రతికూల పరిస్థితులలో దృఢ సంకల్పంతో బీజేపీని చిత్తు చేశారు. ఆ అసాధారణ విజయం ఆమెకు జాతీయ నాయకురాలుగా ప్రభవించేందుకు అవకాశం కల్పించింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకై బెంగాల్ వెలుపల తన పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను విస్తరింపచేసేందుకు ఆమె ప్రయత్నించారు. ఆదిలోనే హంసపాదు. తప్పులు జరిగాయి. గోవా అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ పోటీ చేసింది. అయితే 'బయటి పార్టీ' అనే ముద్రను వదిలించుకోలేకపోయింది. బెంగాల్లో 'భూమిపుత్రి' గా మమతకు ఉన్న ప్రతిష్ఠ బెంగాల్ వెలుపల తృణమూల్ కాంగ్రెస్‌కు ఒక బలహీనతగా పర్యవసించింది. ఆమె కుటుంబ సభ్యుల అవినీతిపై బీజేపీ దృష్టి కేంద్రీకరించింది. మమత కేబినెట్ మంత్రులు భారీ అవినీతికి పాల్పడినట్టు దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. దీంతో మమత జాతీయ ఆకాంక్షలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఇప్పుడు ఆమె తన రాజకీయ కార్యకలాపాలను బెంగాల్‌కే పరిమితం చేసుకున్నారు. 2022లో అరవింద్ కేజ్రీవాల్ కేబీసీ పోటీదారుగా ప్రకాశించారు. ఆయన నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ శాసనసభ ఎన్నికలలో ఘన విజయం సాధించింది. ఆప్ పాలన ఇప్పుడు రెండు రాష్ట్రాలకు విస్తరించింది. పంజాబ్ విజయంతో అఖిల భారత స్థాయిలో ఆప్ పతాకాన్ని ఎగురవేయాలని కేజ్రీవాల్ ఆకాంక్షించారు. సాహసోపేతంగా మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ ఎన్నికల బరిలోకి ప్రవేశించారు. హోరాహోరీ పోరాటం జరిగింది. అంతిమ విజయం బీజేపీకే దక్కింది. కేంద్రం ఆ తరువాత ఆప్ నేతలపై దృష్టి కేంద్రీకరించింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఆప్ నేతలు అరెస్టయ్యారు. అవినీతిపై పోరుతో అధికారంలోకి వచ్చిన ఆప్ ఇప్పుడు తానే అవినీతి ఆరోపణలలో కూరుకుపోయింది. 2023లో కేబీసీ తతంగం ఒక ఆకర్షణీయమైన మలుపు తిరిగింది. గత కొద్ది నెలలుగా రాహుల్ గాంధీ, ప్రధాని మోదీకి ప్రధాన ప్రత్యర్థిగా పునరావిష్కృతుడయ్యారు. ఇలా ఇది ఎన్నోసారి? లెక్కలేదు. భారత్ జోడో యాత్రకు అసాధారణంగా లభించిన ప్రజల మద్దతు కాంగ్రెస్‌ను నిద్రాణ స్థితి నుంచి మేలుకొల్పింది. పరువు నష్టం కేసులో రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై పడిన అనర్హత వేటుతో నరేంద్రమోదీ నిరంకుశత్వ బాధితుడుగా ఆయనకు ప్రజల సానుభూతి అపారంగా లభించింది. ప్రతిపక్ష నాయకులు చాలా మంది నరేంద్ర మోదీ పాలనను ప్రతిఘటించడానికి భయపడుతున్న తరుణంలో రాహుల్ నదురు బెదురు లేకుండా కేంద్ర ప్రభుత్వంపై వాడి, వేడైన విమర్శలు సంధించసాగారు. ఇదే ఆయనను నిస్సందేహంగా ప్రజల దృష్టిలో ఒక ధీరోదాత్తుడుగా నిలబెట్టింది. అయితే ఆయనకున్న పరిమితులు తక్కువేమీ కావు. పైగా అవి స్పష్టమైనవి. రెండు సార్వత్రిక ఎన్నికలలో ఆయన కాంగ్రెస్‌కు నేతృత్వం వహించారు. రెండు సార్లూ ఆ పార్టీ ఘోరంగా పరాజయం పాలయింది. ఈ వైఫల్యాలకు ఆయన బాధ్యత లేదా? ఉందని కాంగ్రేసేతర ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. మోదీకి ఆయన సమర్థమైన ప్రత్యామ్నాయం కాగలడని అవి ఇంకా విశ్వసించడం లేదు మరి. నిజాలు కఠోరంగా ఉంటాయి. ఇప్పుడు ఎన్నికలలో అన్ని పార్టీలకూ విజయావకాశాలు సమానంగా లేని పరిస్థితులు ఉన్నాయి. మరి రాజకీయ పార్టీల, వాటి నాయకుల మారుతున్న అదృష్టాలపై భారతదేశ ప్రతిపక్షం అధికార సాధనకు ఎలా ఆధారపడగలుగుతుంది? పైగా అధికార సమతౌల్యత సంస్థాగతంగా పూర్తిగా పాలకపక్షానికే అనుకూలంగా ఉన్నది. నరేంద్ర మోదీ లాంటి అత్యంత జనాకర్షక, మహా శక్తిమంతుడైన నాయకుడికి ఏ విపక్షమైనా గట్టి సవాల్ విసరగలగడం అసాధ్యమనే చెప్పక తప్పదు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులలో 95 శాతం ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయిబీ ఎన్నికల బాండ్ల రూపేణా ఒకే ఒక్క పార్టీ –ఇది పాలక పక్షం అని మరి చెప్పాలా?– నిధులు అపరిమితంగా అందుబాటులో ఉన్నాయిబీ ఎన్నికల కమిషనర్ మొదలు సమాచార కమిషనర్ దాకా రాజ్యాంగ అధికారులు అందరూ పాలక పక్షానికే అనుకూలంగా ఉంటున్నారుబీ పాలన తీరుతెన్నులను న్యాయస్థానాలు ఎంతగా అభిశంసించినా అదేమీ పాలక పక్షానికి ప్రమాదంగా పరిణమించబోదుబీ పార్లమెంటు కార్యకలాపాలు స్తంభించిపోతున్నాయిబీ మీడియా రాజీపడుతోంది. మరి ఇలాంటి పరిస్థితులలో కార్యనిర్వాహక వర్గ పక్షపాత, అప్రజాస్వామిక పాలనను ఎవరు నిజంగా ఎదుర్కోగలరు? 1977లో ఇందిరాగాంధీ నాయకత్వానికి తీవ్ర సవాళ్లు ఎదురయ్యాయి. ఓటర్లు ఆమెను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ప్రతిపక్షాలు తమ విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడం వల్లే ఇది సాధ్యమయిందా? కానే కాదు. నిజానికి నాటి విపక్ష నేతలలో చాలా మంది తమ రాజకీయ జీవితపు అంతిమ అంకంలో ఉన్నారు. ప్రజలను నవచైతన్య పథాన నడిపించే శక్తి వారికి లేనే లేదు. ఆ మాటకొస్తే ఇందిరకు వ్యతిరేకంగా జనతా పార్టీగా ఏర్పడిన వివిధ పార్టీల మధ్య సైద్ధాంతిక సమైక్యత ఏ మాత్రం లేదు. పలు అంశాలపై సోషలిస్టులు, జనసంఘీయుల అభిప్రాయాలు పూర్తిగా విరుద్ధమైనవి. ఫలితంగా దేనిమీద ఏకాభిప్రాయం సాధ్యమయ్యేది కాదు. మరి వారిని ఏకం చేసిన దేమిటి? మనుగడ సంక్షోభం. ఇందిర అప్రజాస్వామికంగా అత్యవసర పరిస్థితి విధించి తన పాలనను వ్యతిరేకించిన వారినందరినీ జైలులో పెట్టడం వల్ల ప్రతిపక్షాల ఉనికే ప్రమాదంలో పడింది. దీనితో ఆమెకు వ్యతిరేకంగా అవి అనివార్యంగా ఏకమయ్యాయి. ఇందిర ప్రభుత్వంపై ప్రతిపక్షాల పోరాటం న్యాయబద్ధమైనదని ప్రజలూ సంపూర్ణంగా విశ్వసించారు. ఈ కారణంగానే వాటికి ప్రాధాన్యం పెరిగింది. నేటి ప్రతిపక్షాలు కూడా అదే విధమైన మనుగడ సంక్షోభంలో ఉన్నాయి. వాటి సమర నినాదం 'డెమాక్రసీ ఖత్రే మే హై' (ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది) ప్రజల హృదయాలలో అంతగా ప్రతిధ్వనించడం లేదు. ఇప్పుడు అత్యవసర పరిస్థితి ఏమీ అమల్లో లేదు. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతర దర్యాప్తు సంస్థలు ఎప్పుడు తమపై దాడులు చేస్తాయోనన్న తీవ్రభయం ఒకటి ప్రతిపక్ష నేతలను నిరంతరం వెంటాడుతోంది. ఈ భయంతోనే వారు నెమ్మదిగానే అయినప్పటికీ క్రమంగా ఏకమవుతున్నారు. కలిసిపోరాడితేనే తమకు మనుగడ అనే నిజాన్ని వారు గ్రహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హఠాత్తుగా తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌తో చర్చలకు ఎందుకు సుముఖత చూపారు? కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయ్యే అవకాశం ఉండడం వల్లే కాదూ? అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంటులో కాంగ్రెస్ నిరసనల్లో ఎందుకు పాల్గొంటోంది? ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి అదే కేసులో ఇప్పటికే జైలులో ఉండడం వల్లే కాదూ?

# మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరుల గందరగోళం







వాస్తవానికి రోజంతా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌కు ఆర్.ఇ విద్యుత్ అనుబంధంగా ఉండాలి. మోడీ ప్రభుత్వ వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్‌ను ఎక్స్ఛేంజ్‌ల ద్వారా యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకొనేందుకు అనుమతిస్తూ సిఇఆర్‌సి ఉత్తర్వు జారీ చేసింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించిన కొద్దీ, విద్యుత్ కొరత పెరిగి, మార్కెట్లో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని అనుభవం స్పష్టం చేస్తున్నది. ఈ మోడీ ప్రభుత్వ తలతిక్క విధానాలు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని పెంచి, వినియోగదారులపై చార్జీల భారాన్ని లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని లేదా రెండింటిని పెంచాల్సిన పరిస్థితికి దారితీస్తున్నాయి. పునరుత్పత్తి అయ్యే విద్యుత్‌ను (ఆర్.ఇ) ప్రోత్సహించే పేరుతో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వెర్రితలలు వేస్తున్నాయి. ఒకే అంశంపై కేంద్ర మంత్రులు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ పేరుతో కాలుష్యకారకమైన బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వినియోగించటం తగ్గించాలని, ఆర్.ఇ ని ప్రోత్సహించాలని ఒకవైపు మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఈ విషయమై దేశంలో సాధించాలంటున్న లక్ష్యాలను ప్రధానమంత్రి అంతర్జాతీయ వేదికలపై ప్రకటిస్తున్నారు. మరోపక్క దేశంలో బొగ్గు గనుల తవ్వకానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మోడీ ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. దేశంలో వాణిజ్య అవసరాల పేరుతో బొగ్గు గనులను వేలం వేసి ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. గనుల తవ్వకానికి, పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థాపనకు అటవీ భూముల వినియోగానికి విచక్షణా రహితంగా అనుమతులు ఇస్తున్నది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ప్రాజెక్టులకు పరిసరాల అనుమతి, కాలుష్య నియంత్రణా మండలి అనుమతి అవసరం లేకుండా మినహాయించే ముసాయిదా ప్రతిపాదనలను కూడా కేంద్రం చేసింది. మోడీ ప్రభుత్వ ఈ ద్వంద్వ వైఖరులలో ఇమిడి ఉన్నది పెట్టుబడిదారుల ప్రయోజనమే. ఒకవక్క స్వదేశీ పెట్టుబడిదారులకు మరోవక్క అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ...దేశంలో పెట్టుబడి పెట్టేందుకు, విపరీత లాభార్జనకు అవకాశాలను కల్పించి, చట్ట ప్రకారం పొందాల్సిన అనుమతుల నుండి మినహాయింపు ఇవ్వడమంటే వారి పబ్బం గడపటమే. దేశంలో కృత్రిమ బొగ్గు కొరత సృష్టిస్తూ, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ థర్మల్ విద్యుత్ స్టేషన్లు విదేశీ బొగ్గును వినియోగించి కొరత లేకుండా అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఇందుకు అత్యవసర పరిస్థితి అధికారాలను కూడా వాడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి దేశంలో బొగ్గు కొరత లేదని బొగ్గు శాఖ మంత్రి మరోపక్క ప్రకటనలు చేస్తున్నారు. విద్యుత్ స్టేషన్లకు బొగ్గు సరఫరాకు వ్యాగన్లను పెంచుతున్నట్లు రైల్వేలు ప్రకటనలు చేస్తున్నాయి. బొగ్గు రవాణాకు దేశంలో చాలినంతగా వ్యాగన్లు, ఇతర రవాణా సదుపాయాలు లభ్యం కావటం లేదని ప్రకటనలు చేసిన కేంద్రం... విదేశీ బొగ్గును దిగుమతి చేసుకున్నాక... విద్యుత్ స్టేషన్ల వరకు ఓడరేవుల నుండి సరఫరా చేసేందుకు అవసరమైన సంఖ్యలో వ్యాగన్లు, ఇతర రవాణా సదుపాయాలు ఎలా లభిస్తాయన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వటం లేదు. దేశంలో బొగ్గు రవాణాకు విద్యుత్, బొగ్గు, రైల్వే, ఓడరేవుల మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులోను, బయట ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో బొగ్గు కొరతను నివారించటంలో, రవాణాకు తగిన ఏర్పాట్లు చేయటంలో విఫలమౌతున్నది. ఒకపక్క విదేశీ బొగ్గును దిగుమతి చేసుకుని అత్యధికంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆదేశానికి విరుద్ధంగా, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ థర్మల్ విద్యుత్ కేంద్రాలను క్రమేణా మూసివేయాలని, వాటికి బదులు ఆర్.ఇ విద్యుత్‌ను చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ఆదేశించింది. ఆ విధంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు తమ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2023–24లో 20 శాతం, 2024–25లో 35 శాతం, 2025–26లో 45 శాతం మేరకు తాను నిర్దేశించిన లక్ష్యం ప్రకారం తగ్గించాలని ఆదేశించింది. అలా తగ్గించిన థర్మల్ విద్యుత్ సామర్థ్యం బదులు అందుకు సమానమైన సౌర, ఇతర ఆర్.ఇ విద్యుత్ సామర్థ్యాన్ని చేర్చాలని ఆదేశించింది. దానివల్ల తలెత్తే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం గుడ్డెద్దు చేలో పడ్డట్లు వ్యవహరిస్తున్నది.

లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో నెలకొల్పి, విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి, చివరకు మూసివేస్తే వాటిల్లే భారీ నష్టాలను ఎవరు, ఎలా భరించాలనేది మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టటం లేదు. థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యానికి కేంద్రం నిర్దేశించిన విధంగా తగ్గించాలంటే అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. అనవసరంగా అధిక ఆర్.ఇ ని కొనుగోలు చేయటం వల్ల ఇప్పటికే థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్–పిఎల్‌ఎఫ్) తగ్గించటం, పెంచటంలో ఇబ్బందులు, నష్టాలు ఎదురవుతున్నాయని ఇంజినీర్ల సంఘాల ప్రతినిధులు ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలలో వివరించారు. వీటిపై అధ్యయనం జరిపిస్తామని రెండేళ్ల క్రితం అప్పటి ఎపిఇపిడిసిఎల్ సిఎండి బహిరంగ విచారణలో ప్రకటించారు. కేంద్ర విద్యుత్ అథారిటీ (సిఇఎ) నియమించిన నిపుణుల కమిటీ ఆర్.ఇ ని గ్రిడ్‌లో చేర్చటంలో తలెత్తుతున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలను, వాటిల్లే నష్టాలను వివరిస్తూ ఇచ్చిన నివేదికలోని అంశాలను రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు ఎపిఇఆర్‌సికి లిఖితపూర్వకంగా చేసిన నివేదనలలో పొందుపరిచాయి. 2020–21 సంవత్సరానికి ఇచ్చిన చార్జీల ఉత్తర్వులో కమిషన్ వాటిని పొందుపరిచింది. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులతో డిస్కమ్‌లు చేసుకున్న దీర్ఘకాలిక పిపిఎ లలోని షరతులు చట్టబద్ధంగా వర్తిస్తాయి. ఆ ప్రాజెక్టులు ఉత్పత్తిని తగ్గించాలని కేంద్రం ఆదేశం మేరకు డిస్కమ్‌లు స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్‌ఎల్‌డిసి) ద్వారా ఆదేశిస్తే, ఆ మేరకు స్థిర చార్జీలను చెల్లించాలి. పిపిఎ ల గడువు ఉన్నంతవరకు వాటిని మూసివేయాలని ఆదేశించాలంటే, ఆ థర్మల్ ప్రాజెక్టులకు పిపిఎ గడువు ముగిసే వరకు సంవత్సరాలపాటు విద్యుత్‌ను పొందకుండానే డిస్కమ్‌లు స్థిర చార్జీలను చెల్లిస్తూ, ఆ భారాలను వినియోగదారులపై మోపాల్సి వస్తుంది. ఆర్.ఇ విద్యుత్ పీక్ డిమాండ్ తీర్చలేదు గనుక, దానికి అనుబంధంగా పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ వంటివి అభివృద్ధి చేయాలని నిర్ణయించి కేంద్రం అందుకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది. వాస్తవానికి రోజంతా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌కు ఆర్.ఇ విద్యుత్ అనుబంధంగా ఉండాలి. మోడీ ప్రభుత్వ వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్‌ను ఎక్స్ఛేంజ్‌ల ద్వారా యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకొనేందుకు అనుమతిస్తూ సిఇఆర్‌సి ఉత్తర్వు జారీ చేసింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించిన కొద్దీ, విద్యుత్ కొరత పెరిగి, మార్కెట్లో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని అనుభవం స్పష్టం చేస్తున్నది. ఈ మోడీ ప్రభుత్వ తలతిక్క విధానాలు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని పెంచి, వినియోగదారులపై చార్జీల భారాన్ని లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని లేదా రెండింటిని పెంచాల్సిన పరిస్థితికి దారితీస్తున్నాయి. విద్యుత్‌ను బ్యాటరీలో నిల్వ ఉంచి అవసరమైనప్పుడు వినియోగించుకోవటం చాలా ఖరీదైన వ్యవహారమని ప్రస్తుత పరిస్థితి నిర్ధారిస్తున్నది. విద్యుత్‌ను నిల్వ ఉంచి, అవసరమైనప్పుడు వాడుకునేందుకు నిలకడగా చవకగా ఉండే బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ అభివృద్ధి చెందితే పరిస్థితి మెరుగవుతుంది. అలాంటి పరిస్థితిలో, థర్మల్ విద్యుత్ మిగులుగా ఉన్న సమయాల్లో దానిని కూడా బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ పద్ధతిలో వినియోగించుకునేందుకు వీలవుతుంది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు 40–50 సంవత్సరాలపాటు పనిచేస్తాయి. ప్రతియేటా వాటికి విద్యుత్ కొనుగోలు చార్జీలలో భాగంగా అరుగుదల చార్జీల చెల్లింపుతో, పెట్టుబడి వ్యయానికి చేసిన అప్పులు, వడ్డీ చెల్లించటంతో యేటేటా వాటికి డిస్కమ్‌లు చెల్లించాల్సిన స్థిరచార్జీలు తగ్గుతాయి. క్రమేణా ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతున్న పాత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను నవీకరించి, ఆధునీకరించటం (ఆర్ అండ్ ఎం) ద్వారా వాటి పిఎల్‌ఎఫ్‌ను పెంచుతున్నారు. కొత్తగా నెలకొల్పే బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు గణనీయంగా ఖర్చైనా కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లకు వీలుంది. ప్రస్తుతమున్న, కొత్తగా నెలకొల్పే ప్రాజెక్టులకు అలాంటి ఏర్పాట్లు చేయాలని కూడా కేంద్రం ఆదేశిస్తున్నది. కేంద్ర మంత్రులు, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల, బొగ్గు కంపెనీల ఉన్నతాధికారులు అంతర్జాతీయ వేదికలలో, దేశంలో వివిధ సందర్భాలలో చేస్తున్న ప్రకటనలు బొగ్గుతో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కొనసాగాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ విద్యుత్ రంగానికి బొగ్గు వెన్నెముక. దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గుది కీలకమైన పాత్ర. ఇది 2040 సంవత్సరం వరకు, ఆ తరువాత కూడా కొనసాగుతుంది. దేశ ఇంధన అవసరాలలో బొగ్గు అంతర్భాగం. దేశంలో బొగ్గు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. అమెరికా, ఐరోపా యూనియన్ దేశాలు, బ్రిటన్ చారిత్రకంగా పెద్ద కాలుష్య కారకాలుగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య ఉద్గారాల విడుదల నియంత్రణకు అంతర్జాతీయ సహకారం అవసరం. అనేక దేశాలతో పోల్చితే దేశంలో తలసరి బొగ్గు వినియోగం చాలా తక్కువ. బొగ్గుతో ఉత్పత్తి చేసే థర్మల్ విద్యుత్ బదులు ఆర్.ఇ ని చేర్చటం అనేక సమస్యలతో కూడుకున్నది. ఇది క్రమేణా జరగాలి. వచ్చే కొద్ది దశాబ్దాలలో బొగ్గు వినియోగాన్ని నిలిపివేయటం సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ అధికారికంగా వెలిబుచ్చిన అభిప్రాయాలే. ప్రజలపై భారాలను తగ్గించేందుకు, ప్రజావసరాలు తీర్చేందుకు అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. దీర్ఘకాలిక ప్రాతిపదికన అధిక చార్జీలకు ఆర్.ఇ ని కొనుగోలు చేసేందుకు మితిమీరి చేసుకున్న పిపిఎ ల ఫలితంగా... వినియోగదారులపై నివారించదగిన భారాలు కొనసాగుతున్నాయి. ఆర్.ఇ ని ప్రోత్సహించటం దశల వారీగా జాగ్రత్తగా జరగాలి. హెచ్చుతగ్గులకు లోనవుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు సాధ్యమైనంత వరకు మిగులు విద్యుత్ తక్కువగా ఉండే విధంగా వివిధ రకాల విద్యుత్ మిశ్రమంలో సాంకేతికంగా సాధ్యమైన మేరకు సమతూకం ఉండేలా సముచిత నిర్ణయాలు తీసుకోవాలి. సానుకూల, ప్రతికూల అంశాలను, లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి. ఈ దిశలో పరిశోధన, అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలి.

## పునరాగమనం



సింధువంత ద్ఞఖాన్ని మోయలేక
కన్నీటి బిందువు ఓడి పోయింది!
హృదయ ఘోషని
విప్ప లేక భాష ఓడిపోయింది!
తత్వం తెలియక కవిత్వం ఓడిపోయింది!
తిమిరాన్ని తరమలేక
మిణుగురు ఓడిపోయింది!
రాత్రి స్వప్నాలను సాకారం చెయ్యలేక
ధరిత్రి ఓడిపోయింది !

మానవత్వపు గాయాలు మాన్చలేక
న్యాయం ఓడిపోయింది !
నేతల రాతలు నమ్మి
ప్రజాస్వామ్యం ఓడిపోయింది !

కానీ, చెట్టు ఓడిపోలేదు
రాతిలో కూడా తేమని తీసుకుని
ప్రతి వత్సరం వసంతాన్ని ఇస్తోంది !

– వీరేశ్వర రావు మూల

# బిజెపి కుయుక్తులు, మోడీజీ సూక్తులు!

**(మొదటిపేజీ తరువాయి)**

కాపాడుకోవాలని సిపిఎం నొక్కి చెబుతున్నది. ఇటీవలే ముగిసిన సిపిఎం రాష్ట్ర కమిటీ ఇదే విషయం నొక్కి చెప్పడమే గాక కార్యాచరణ కూడా ప్రారంభించింది. తాజాగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ఇందుకో ఉదాహరణగా చెప్పొచ్చు. ఆ సమావేశంలో టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుకూ సీనియర్ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావుకు మధ్య జరిగిన చర్చ ఇందుకు అద్దం పడుతుంది. పోలవరం విషయంలో కీలకమైన కేంద్రాన్ని పక్కన పెట్టి గత, ప్రస్తుత ప్రభుత్వాల కోణంలోనే విమర్శలు గుప్పిస్తే ఉపయోగం ఏమిటన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. నిజానికిది ఎ.పి రాజకీయాలలోనే సంక్లిష్టమైన అంశం.

బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్య అవగాహన, ఉద్యమాలు ఉమ్మడి పోరాటం పెరుగుతున్న కొద్దీ వచ్చే ఎన్నికలలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం బిజెపికి పెద్ద సవాలుగానే తయారవుతున్నది. నిరంకుశ కార్పొరేట్ మతతత్వం, అదానీ కుంభకోణాలు, రాహుల్ అనర్హత వేటు వంటి వాటిపై అనేక రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసనలు ప్రజాగ్రహాలు బిజెపిని భయపెడుతున్నాయి. బలమైన ప్రాంతీయ పార్టీలూ, వామపక్షాలు వున్న చోట గతంలో వలె నల్లేరు మీద బండిలా గెలవలేకపోవచ్చున్న వాస్తవం భయపెడుతున్నది. ఉన్న మిత్ర పక్షాలు కూడా దూరం కాగా కలసివచ్చే వారు కరువవుతున్నారు. అందులోనూ దక్షిణాదిన కాలూనడం బిజెపికి ఎప్పుడూ సవాలుగానే వుంది. కర్ణాటక చేజారవచ్చున్న అంచనాలు అన్ని వైపులా వినిపిస్తున్నప్పుడు కేరళ, తమిళనాడులలో ఠికాణా లేనప్పుడు తెలుగు రాష్ట్రాలపైనే ఆ పార్టీ అధిష్టానం దింపుడు కళ్లం ఆశ పెట్టుకుంది.

### ప్రాంతీయ పార్టీల తీరు

మొదటగా టిడిపి 41వ వ్యవస్థాపక సభ హైదరాబాదులో జరిగింది. చంద్రబాబు ప్రసంగంలో బిజెపి విధానాలపై ఒక్క విమర్శ కూడా లేకపోగా ఒకటి రెండు సార్లు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెప్పారు. ఆయనతో కలసి తాను సాధించిన విజయాలు కూడా చెప్పడమే గాక పరోక్షంగా నోట్ల రద్దును సమర్థించారు. పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబుకు అవగాహన వుందనీ, జనసేన సీట్ల వరకూ చెప్పి బిజెపి విషయం తనకు వదిలేయమని ఆయనకు చెప్పారని టిడిపి కీలక నాయకులు చెబుతున్నారు. ఈ మధ్య ఒకటి రెండు సందర్భాలను పురస్కరించుకుని బిజెపి అధ్యక్షుడు నడ్డా టిడిపి గురించి సానుకూల సందేశాలిచ్చారు. అయితే వారే తమ వెంటపడుతున్నారని బిజెపి నేతలంటారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి జగన్ ఒకటికి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి అమిత్ షా తో సహా కేంద్ర మంత్రులను కలసి వచ్చాక పార్లమెంటులో ఎ.పి ప్రశ్నలకు దాటవేత సమాధానాలు ఇచ్చారు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేది లేదనీ చెప్పారు. జగన్ ప్రభుత్వం ఎంత సానుకూలంగా చిత్రించినా పోలవరం సహా ఏ సమస్యపైనా కేంద్రం అవసరమైన చర్యలు చేపట్టింది, నిధులు విడుదల చేసింది లేదు. విచిత్రంగా ఇలాంటి సమయంలోనే పవన్ కళ్యాణ్ హఠాత్తుగా ఢిల్లీ వెళ్లారు. ఆ పార్టీ ఎంత హంగామా చేసినా కంటి తుడుపుగా కొద్దిసేపు నడ్డా కలిశాననిపించారు తప్ప భాగస్వామిగా ఆదరించింది లేదు. ఓట్ల చీలిక నివారించడం అనే పాట తప్ప పవన్ కొత్తగా చెప్పింది లేదు. మోడీ విశాఖ రాకలోనూ ఇలా కొద్దిసేపు భేటీ జరిపి రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయి అని ప్రకటించిన పవన్ కళ్యాణ్ ఢిల్లీలోనూ సాధించింది శూన్యమే. ఎ.పి విషయంలో సానుకూల చర్చలు తీసుకునే ఉద్దేశమే బిజెపికి లేదని దీంతో మరోసారి స్పష్టమైంది. అయితే దీని తర్వాత కూడా జనసేన నాయకులు కేంద్రం ఏదో వొరగబెట్టినట్టు రాష్ట్రానిదే తప్పయినట్టు మాట్లాడటం వింతగొల్పుతుంది. రాహుల్ గాంధీ అనర్హత సమస్యపై కలసి రావాలని కె.వి.పి.రామచంద్రరావు ప్రత్యేకంగా అభ్యర్థించినా టిడిపి నుంచి అధికారిక స్పందన లేదు! మేము కష్టాల్లో వున్నప్పుడు మాతో కలసిరాని పార్టీలతో మేమెందుకు కలవాలని టిడిపి నేతలు జవాబిచ్చారు. కనుకనే మూడు ప్రాంతీయ పార్టీలూ ఏదో రూపంలో బిజెపి వ్యూహాలకే ఊతమిస్తున్న తీరును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఇటీవలి రాష్ట్ర కమిటీ సమావేశానంతరం నిశితంగా విమర్శించారు.

కొత్త పార్టీగా వచ్చిన వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు షర్మిల బిజెపితో కలసి కార్యక్రమాలు ప్రతిపాదించడం, రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం ఇదే కోవలో వుంది. నిరుద్యోగ సమస్యపై అంతా కలసి పని చేయాలని చెప్పే పేరుతో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలను సందర్శించిన షర్మిల ఆ పార్టీలపై అనుచిత ఆరోపణలు చేస్తే తమ్మినేని గట్టిగానే ఖండించారు. బిజెపి హానికర విధానాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్‌కు మునుగోడు ఎన్నికలలో మద్దతివ్వడం సరైందేననీ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బిఆర్ఎస్ బి టీమ్‌గా వున్నారని మీరు మా ఆఫీసుకు వచ్చి నిందలు వేయడం మర్యాద కాదని షర్మిలకు సూటిగానే చెప్పారు. మీడియా లోనూ ఇది ప్రధాన చర్చనీయాంశమైంది.

### నిరసనలే సమాధానం

తెలంగాణలో తామే అధికారానికి రాబోతున్నామని ఆర్భాటం చేసిన బిజెపి కి క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని తేలిపోయింది. లిక్కర్ కేసు పేరిట బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను అనేకసార్లు విచారించడమే గాక అరెస్టు అనివార్యం అని హల్‌చల్ చేసినా ఇంతవరకూ అది సాధ్యం కాలేదు. ఇక ముందు ఏమయ్యేది తెలియదు. దేశవ్యాపితంగానే ప్రతిపక్షాలు ఇ.డి, సిబిఐ ల దుర్వినియోగాన్ని రాజకీయంగా న్యాయపరంగా కూడా సవాలు చేయడం వాతావరణం మార్చింది. ఈలోగా ప్రశ్నాపత్రాల వ్యవహారంలో బిజెపి పాత్ర అనుమానాస్పదంగా తేలి సాక్షాత్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టయ్యారు. బెయిలు మీద ఆయన వచ్చినా కేసు కొనసాగుతున్నది. బిజెపి ఆశించినట్టు ప్రముఖులెవరూ ఆ పార్టీలో చేరింది లేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాత్రం చేరారు గాని ఆయన వల్ల ఒరిగేది లేదని బిజెపి నేతలే చప్పరిస్తున్నారు. తెలంగాణలో ఆశించింది జరగలేదని అర్థమైన మోడీ, అమిత్ షా లు పదేపదే పిలిచి మాట్లాడటం, పర్యటించడం సర్వసాధారణమైపోయింది. బిఆర్ఎస్ స్థాపన తర్వాత కెటిఆర్ ఎ.పి వ్యవహారాలపైనా దృష్టి పెంచి విశాఖ ఉక్కుపై లేఖ రాయడం చర్చకు కారణమైంది. ఈలోగా సింగరేణిలో అయిదు బావులు వేలం పెట్టడంతో విశాఖ ఉక్కు తంతు పునరావృతమవుతున్నది. మోడీ పర్యటన సమయంలోనే బిఆర్ఎస్ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన నిరసన ప్రదర్శనలు ఆయనకు నిజమైన సమాధానంగా వున్నాయి. తెలంగాణలో సిపిఎం చైతన్య యాత్రలు పూర్తికాగా సిపిఐ సాగిస్తున్నది. ఎ.పి లోనూ ఉభయ పార్టీలూ 14వ తేదీ నుంచి ప్రజా సమీకరణలకు, ప్రచారోద్యమానికి శ్రీకారం చుడుతున్నాయి.

# విశాఖ ఉక్కు బిల్డింగ్‌లో తెలంగాణ

విశాఖపట్టణం, ఏప్రిల్ 9, :వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించిన రెండు రోజుల బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వైజాగ్ లో బహిరంగ సభ నిర్వహించాలని డిసైడ్ చేయడం వెనుక..స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాలనే ఆత్రం కన్నా.. తమ పార్టీని ఏపీలో విస్తరించాలన్న ఆరాటమే ఎక్కువగా కనిపిస్తోంది. స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా కేసిఆర్ బహిరంగ సభ నిర్వహించేందుకు నిర్ణయించారు.ఆ సభను ఈ నెలలోనే అంటే ఏప్రిల్ లోనే నిర్వహించేందుకు ఏపీ బీఆర్ఎస్ అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అయితే ఇది స్టీల్ ప్లాంట్ కార్మికుల కోసం కాదు.. ఏపీలో పార్టీ విస్తరణకేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ వర్గాలు మాత్రం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మికులకు సంఘీభావంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు చెప్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో బీఆర్ఎస్ ఏపీ శాఖ భాగస్వామ్యం అయ్యింది. కేంద్రం లోని మోడీ సర్కార్ అన్ని ప్రభుత్వరంగ సంస్థలను తన కార్పొరేట్ మిత్రులకు అప్పనంగా కట్టబెడుతోందని ఇటీవల కేసీఆర్, కేటీఆర్ అన్ని వేదికలపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభ తర్వాతే వైజాగ్లో పార్టీ బహిరంగ సభ నిర్వహించాలని భావించినా ఆ తరువాత మళ్లీ ఇప్పటి దాకా కేసీఆర్ ఆ ఊసే ఎత్తలేదు.మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన కేసీఆర్.. నాందేడ్ జిల్లాలో సభలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని అస్త్రంగా చేసుకొని ఏపీలో పార్టీ ప్రస్థానం షురూ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్ల ను ఏపీ బీఆర్ఎస్ చీఫ్ తోట చంద్రశేఖర్, ఇతర నేతలకు అప్పగించినట్లు చెబుతున్నారు. ఈ నెలలోనే కేసీఆర్ సభ ఉండే అవకాశముందని అంటున్నారు. తెరాస బీఆర్ఎస్ గా మారిన తర్వాత కేసీఆర్ ఏపీపైనే ఫోకస్ పెట్టారు. పలువురు నాయకులను చేర్చుకోవడంతో పాటు పెద్ద ఎత్తున సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో టచ్ లో ఉన్నారని బాంబు పేల్చారు. అయితే, దీనికి ఏపీ ఎమ్మెల్యేలు, ఇతరుల నుంచి పెద్దగా రెస్పాన్స్ రాలేదు. ఏపీలో జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తో బీఆర్ఎస్ కలిసి పనిచేయబోతోంద నే ప్రచారం సాగినా అది వాస్తవం కాదని వెంటనే తేలిపోయింది. దీంతో కేసీఆర్ ఏపీలో పార్టీ విస్తరణ ప్రయత్నాలను తగ్గించారనే ప్రచారమూ జరిగింది. ఇప్పుడు ఏపీలో పార్టీ విస్తరణ కు తెలంగాణ సీఎం కేసీఆర్ నడుంబిగించారని పార్టీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. గద్వాల జిల్లాతో పాటు ఏపీలోని ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ప్రభావం చూపగల చల్లా వెంకట్రామిరెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడానికి కూడా అదే కారణమని అంటున్నారు. అయితే ఏపీలో మళ్లీ అధికారం నిలబెట్టుకోవాలని వైసీపీ, గత ఏడాది ఒంగోలు మహానాడు సక్సెస్ తర్వాత .. జనంలో పాపులారిటీ క్రమంగా పెంచుకుంటున్న తెలుగుదేశం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తాం అంటూ జనసేన ఇలా ఏపీలోని మూడు ప్రధాన పార్టీల హోరులో బీఆర్ఎస్ వెంట నడిచేవారెవరుంటారన్న సందేహాన్ని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.




# విష్ణువర్ధన్ రెడ్డి ప్రయత్నం సఫలం

అనంతపురం, ఏప్రిల్ 9, :ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరడం అనూహ్య పరిణామం. ఆయన కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు. రాష్ట్ర విభజన నిర్ణయంతో పార్టీపై విశ్వాసం కోల్పోయారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినా యాక్టివ్ కాలేకపోయారు. కాంగ్రెస్ హైకమాండ్ తన సూచనలు పట్టించుకోకపోవడం ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఆయన సైలెంట్ అయిపోయారు. అయితే బీజేపీలో చేరడం మాత్రం అనూహ్యం. కిరణ్‌ను బీజేపీలోకి తీసుకురావడంలో ఏపీబీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆయన నిరంతరం.. అటు హైకమాండ్‌తో ఇటు కిరణ్ కుమార్ రెడ్డితో చర్చలు జరిపి బీజేపీలో చేరికకు మార్గం సుగమం చేసినట్లుగా తెలుస్తోంది. విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్ర విభజన జరిగింది. అయితే ఈ విభజనను కిరణ్ కుమార్ రెడ్డి వ్యతిరేకించారు. ఆ సమయంలో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభించారు. ఆ సమయంలో పదవులు ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరూ కిరణ్ కుమార్ రెడ్డితో నడవడానికి ముందుకు రాలేదు. కానీ రాయలసీమ జిల్లాల నుంచి విష్ణువర్ధన్ రెడ్డి.. కిరణ్ కుమార్ రెడ్డి చేపట్టిన సమైక్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ సమయంలో కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణువర్ధన్ రెడ్డి సన్నిహితమయ్యారు. అప్పట్నుంచి ఉన్న సన్నిహిత సంబంధాలతో ఇప్పుడు పార్టీని బలోపేతం చేయడానికి విష్ణువర్ధన్ రెడ్డి ఉపయోగించుకున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో పూర్తి స్థాయిలో బీజేపీలో యాక్టివ్ అయిన విష్ణువర్ధన్ రెడ్డి నెహ్రూ యువ కేంద్ర వైస్ చైర్మన్‌గా సమర్థంగా పని చేస్తూ జాతీయ స్థాయి నేతల అభిమానాన్ని చూరగొన్నారు. పార్టీ బలోపేతం కోసం విష్ణువర్ధన్ రెడ్డి కష్టపడే తీరు పెద్దలకు నచ్చింది. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో చేరితే మంచి ఫలితాలు వస్తాయని ఆయన భావించారు. మొదట కిరణ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. ఏపీలో బీజేపీ ఎదగడానికి ఉన్న అవకాశాలపై చర్చించి.. పార్టీలో చేరేలా ఒప్పించారు. తర్వాత విష్ణువర్ధన్ రెడ్డి బీజేపీ హైకమాండ్ పెద్దలతోనూ మాట్లాడారు. నిజానికి మాజీ ముఖ్యమంత్రి స్థాయి నేతను పార్టీలో చేర్చుకోవాలంటే చిన్న విషయం కాదు. ఎందుకంటే పార్టీలో చేరే ఆ నేతకు సముచిత గౌరవం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి సమస్యలన్నింటినీ విష్ణువర్ధన్ రెడ్డి పరిష్కరించారు. ఇటు కిరణ్ రెడ్డితో అటు హైకమాండ్‌తో సంప్రదింపులు జరిపి చివరికి లైన్ క్లియర్ చేశారు. ఆయన పట్టుదల ఫలించి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ సభ్యుడయ్యారు. అందుకే ఢిల్లీలో కిరణ్ రెడ్డి బీజేపీలో చేరిక సమయంలో కూడా విష్ణువర్ధన్ రెడ్డి కీలకంగా వ్యవహరించారు.

## రోటరీ సేవలు ప్రశంసనీయం

**మున్సిపల్ చైర్మన్ జంజనం. శ్రీనివాసరావు**
**ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన**
**360 మంది హాజరు, 160 మందికి సర్జరీకై నిర్ధారణ**



చీరాల, ఏప్రియల్ 09, ప్రజాపాలన : రోటరీ సేవలు ప్రశంసనీయమని, నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం అవుతూ, రోటరీ సభ్యులు చేస్తున్న సేవ స్ఫూర్తి దాయకమని, చీరాల మున్సిప ల్ చైర్మన్ జంజనం. శ్రీనివాస రావు, రోటరీ సభ్యులను ప్రశంసించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, జిల్లా అంధత్వ నివారణా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో, ఇన్నర్ వీల్ క్లబ్ సౌజన్యంతో, రోటరీ సామాజిక భవనం నం దు, జరిగిన “శంకర మెగా కంటి వైద్య శిబిరాన్ని, మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో హాజరైన రోగులు, వారి సహాయకులకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భోజ న వసతి ని, తదితర ఏర్పాట్లను రోటరీ సభ్యులు స్వయంగా పర్యవేక్షిం చారు. వైద్య శిబిరానికి సుమా రు 360 మంది రోగులు వైద్య సేవలు పొందారు. 160 మందికి క్యాటరాక్ట్ సర్జరీ అవసరమని నిర్ధారణ కావటంతో, వారి అంగీకారం మేరకు, ఈరోజు 30 మందిని సర్జరీకి తీసుకు వెళ్తు న్నారని, మిగతా 130 మందిని 11వ తేది తీసుకువెళ్ళి, సర్జరీ చేసి తిరిగి తీసుకువస్తారని రోటరీ ప్రతినిధులు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో డా.బాబూరావు, సి. హెచ్.బాల వెంకటేశ్వరరావు, బి. హేమంత్ కుమార్, యస్.వి. స్వామి, వలివేటి మురళీకృష్ణ, యం.వి.రా మారావు, క్లబ్ అడ్మి నిస్ట్రేటివ్ డైరెక్టర్.పోలుదాసు రామకృష్ణ ,గుర్రం రాఘవరావు, సుభాషిణి, కరణం శ్రీనివాసబాబు, డి.ఎన్.లాల్, డి.వి. సురేష్, రఘుకుమార్, డాక్టర్స్, హాస్పిట ల్ స్టాఫ్,రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

## శంభో యోగ సత్సంగ కార్యక్రమానికి విశేష స్పందన



వేటపాలెం, ఏప్రియల్ 09, ప్రజాపాలన : వేటపాలెం మండలం, కొత్తపాలెం రోడ్‌లో గల శ్రీ దత్తక్షేత్రం నందు, శ్రీ జి స్వామిజి చే శంభో యోగ సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సత్సంగ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్య క్రమంలో యూత్ అధికంగా పాల్గొన్నారు. ఆధ్యాత్మికంగా పరమేశ్వరుని కృపా కటాక్షాలు పొందుటకు, చక్కటి యోగ సాధన యే ప్రధానమని చెపుతూ, ప్రతి ఒక్కరు కూడా యోగ సాధన ద్వారా, ఆ పరమేశ్వరుని యొక్క కృపాకటాక్షములు పొందేందుకు, యోగ సాధన ఒక మార్గము అని చెప్పారు. వీరు రాష్ట్రంలోని అన్ని ప్రాంతములలో పర్యటిస్తూ, సత్సంగ సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వేటపాలెం దత్తక్షేత్రం కన్వీనర్ ప్రమీలా దేవి, అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు, సెక్రటరీ నున్నా శివప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీ కరణం మురళీకృష్ణ, ఊటుకూరు కోమలి, తదితర దత్త పరివార్ మహిళలు పాల్గొన్నారు.

## కడపలో పట్టాలెక్కని పరిశ్రమలు

కడప, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందనే ఆశలు కల్పించింది విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇందులో ఒప్పందాలు కడప జిల్లాకు అనేక పరిశ్రమలను పరుగులు పెట్టించనున్నాయనే భ్రమలు కల్పించాయి. అయితే ఒప్పందాలు జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కడప జిల్లాకు వచ్చే పరిశ్రమలు ఏమిటి? ఏయే రకాల పరిశ్రమలు వస్తున్నాయి. ఏ పరిశ్రమ ఎంత పెట్టుబడితో రానుంది ? వీటికి ఎంత భూమి కావాలి ? ఇలాంటి ఏ సమాచారం ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికే అందకపోవడంతో ఈ ఒప్పందాల సంగతేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్చి మూడో తేదీన విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటైన ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లో 21 పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రూ.1500 కోట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవో గౌతమి అప్పట్లో వెల్లడించారు. ఈ పరిశ్రమల ద్వారా 5400 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో జిల్లా వాసులు పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయని, యువత ఉపాధికి ఊతం దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఇప్పటికే పలు సెల్ కంపెనీలు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు కొన్ని ఏర్పాటవుతున్నాయి. 6700 ఎకరాల్లో ఏర్పాటైన ఈ మెగా ఇడస్ట్రియల్ పార్క్ లో రెండు ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఉన్నాయి. వీటిలో ఏర్పాటు చేసేందుకు విశాఖ సమ్మిట్ లో పారిశ్రామిక వేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం 21 పరిశ్రమలు ఏర్పాటైతే కొప్పర్తి పారిశ్రామిక వాడకు నిండుదనం రావడంతోపాటు రాష్ట్రంలోనే ఎలక్ట్రానిక్ వెలుగులకు కడప జిల్లా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందని ఆశించారు. అందునా ఈ సమ్మిట్ కు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాల రాయబారులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. దీంతో అప్పట్లో ఈ సమ్మిట్ భారీ సక్సెస్ అయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవ్వడంతోపాటు ప్రభుత్వం కూడా సంతృప్తిని వ్యక్తం చేసింది.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకవర్గాలు విఫలం: కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ



ఇబ్రహింపట్నం ఏప్రిల్ తేదీ 9 ప్రజాపాలన ప్రతినిధి : కొత్తపల్లిలో సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శనదేశంలో ఇంకా కొనసాగుతున్న కుల వ్యవస్థపేదలకు అందని విద్య, వైద్యంకొంతమందికే కేంద్రంగా మారిన దేశ సంపదగ్రామాలలో పట్టిపీడిస్తున్న కుల వ్యవస్థఅంబేద్కర్ ఆలోచన విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలిభూమి కొంతమందికే పరిమితం కాకుండా జాతీయం చేయాలి.దేశానికి స్వతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అమలు చేయడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని కొత్తపల్లిలో అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సంగం శరణం గచ్చామి అనే నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాన్ వెస్లీ హాజరై మాట్లాడుతూ గ్రామాలలో ఇప్పటివరకు కుల వ్యవస్థ, వర్గ పోరు పట్టిపీడిస్తుందని మండిపడ్డారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందకుండా, కొన్ని వర్గాల వారు లబ్ది పొందుతున్నారని విమర్శించారు. హిందుత్వ భావజాలం దేశ ప్రజలపై రుద్దుతూ రాజకీయంగా లబ్ది పొందుతున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు విద్య, వైద్యం అందడం లేదని చెప్పారు. దేశంలో కుల వ్యవస్థ, వర్గా పోరు పోవాలంటే భూమిని జాతీయం చేయాలని వివరించారు. అంబేద్కర్ ఆలోచన విధానం దేశవ్యాప్తంగా అమలు కావాలంటే వెనుకబడిన వర్గాలు, పీడిత ప్రజలు ఏకమై ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలు చేసినప్పుడే వది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భారత రాజ్యాంగం పూర్తిస్థాయి అమలు కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలియజేశారు. అనంతరం సంగం శరణం గచ్చామి నాటక ప్రదర్శన చూడడానికి వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎండి హబీబుద్దిన్, ఎంపీటీసీ సుమతమ్మ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి నరసింహ, ప్రజా సంఘాల నాయకులు పగడాల యాదయ్య, జంగయ్య, కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు కావాలి జగన్ ఉప సర్పంచ్, దంతుక పెద్దయ్య సర్పంచ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోలే శివ, ఎస్ఎఫ్ఐ యాచారం మండల అధ్యక్షులు విప్లవ్ కుమార్, డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, సైదులు, నారాయణ వెంకటేష్, జంగయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంచిపనులు అనేకం చేసాం... ప్రజలకు ధైర్యంగా చెప్పుకుందాం...

**జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



ఇబ్రహింపట్నం ఏప్రిల్ తేదీ 9 ప్రజాపాలన ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం,మంచాల మండల కేంద్రంలోని దండేటికారి ఫంక్షన్ హాల్ లో జరిగిన మండల బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించిన జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ .ఇటీవల అనారోగ్యంతో మరణించిన రంగాపూర్ గ్రామానికి చెందిన ఉద్యమ కారుడు నయినంపల్లి గణేష్ గారికోసం 2నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ %ు% బిజెపి పార్టీలు చేసిందేమీ లేదంటూ, బిఆర్ఎస్ పార్టీతోనే అనేక అభివృద్ధి అయ్యిందని స్పష్టం చేశారు, చేసిన పనులు ప్రజలకు గుర్తు చేసే బాధ్యత మనదన్నారు.ఇతర పార్టీలు కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కార్యక్రమంలో ఉన్నారని, ప్రజలకు చేసేదేమీ లేదని,అబద్ధాల ప్రచారాలకే వారు పరిమితమని అన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య,ఎంపీపీ నర్మదా, మండల అధ్యక్షులు చీరాల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంజి రెడ్డి, పీఏసియస్ చైర్మన్ పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బహుదూర్, నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి



శేరిలింగంపల్లి ప్రజా పాలన /ఏప్రిల్ 8 న్యూస్ :శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నాయకులు ధాత్రి గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం పార్టీ నాయకులు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ శ్రేణులు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ధాత్రి గౌడ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు. ధాత్రి గౌడ్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ జన్మదిన వేడుకలకు బీఆర్ఎస్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, సీనియర్ నాయకులు సంగారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు బాబు మోహన్ మల్లేష్, అంబేద్కర్ సంఘం నాయకులు రాంబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



శంకరపట్నం ఏప్రిల్ 09 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలను టిడిపి మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఆరిఫ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో దామోదర్ రెడ్డి కరీంనగర్ జిల్లా టైగర్ గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండి సాబీర్, గోపు వీరమల్లు, ఊకంటి మధుకర్ ,గుర్రం బుచ్చయ్య, బొంగోని చందు, బైరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీలో చిరుధాన్యాల గురించి అవగాహన సదస్సు



ఇబ్రహింపట్నం ఏప్రిల్ తేదీ 9 ప్రజాపాలన ప్రతినిధి :భారతీయ జనతా కిసాన్ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జక్క రవీందర్ రెడ్డి, అధ్యక్షతన ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలో ఆదివారం రైతులకు చిరుధాన్యాల గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు బసవ పాపయ్య గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చి రెడ్డి, ముత్యాల భాస్కర్ , కొత్త అశోక్ గౌడ్, నాయిని సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ రైతులు పండించే పంట



సేంద్రియ ఎరువులతో పంట పండించాలని అదేవిధంగా దేశ ప్రజల ఆరోగ్యం బాగుండాలని చెప్పి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులను ఉద్దేశించి అదేవిధంగా ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని అసెంబ్లీ కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పిన సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేయడం జరిగింది. కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల గురించి జొన్నలు, సజ్జలు, రాగులు, అరికెలు, వదలు, పెసర్లు ఉలువలు, కందులు రైతులు పండించాలని వారికి తెలియజేయడం జరిగినది.ప్రజల ఆరోగ్య దృష్ట్యా గతంలో మన పెద్దలు జొన్నగట్కా సంకటి తిని, అంబలి తాగి ఆరోగ్యంతో 100 ఏళ్ళు బ్రతికి వారని కావున రైతులు అందరూ పండించే పంటలను సేంద్రియ ఎరువులతో పప్పు దినుసులు పండించాలని చెప్పి ఈ అవగాహన సదస్సులో రైతులను ఉద్దేశించి మాట్లాడడం జరిగినది. ప్రజలు షుగర్తో, బీపీతో, బాధపడుతున్నారు. కావున వీటన్నిటిని కాపాడుకోవాలని రైతులందరూ పప్పు దినుసులు పండించాలని చెప్పి తెలియజేయడం జరిగినది. ఈరోజు రంగారెడ్డి జిల్లాలో అన్ని అసెంబ్లీ కేంద్రాలలో ఇట్టి కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నవారు సూరంపల్లి కాళిదాసు ,తాళ్ల వెంకటేష్ గౌడ్ ,మంచాల వైసీపీ ధన్య భాష , బూడిద నరసింహారెడ్డి ,విట్టల్ రెడ్డి ,శ్రీశైలం , పోచన్నమాల , శ్రీకాంత్ ,ముత్యాల మహేందర్ ,రాఘవేందర్ ,శ్రీశైలం ,అశోక్ మరియు తదితరు మండల నాయకులు,మున్సిపల్ నాయకులు,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటికి సిపిఐ



చేవెళ్ల ఏప్రిల్ 9, (ప్రజాపాలన): మోడీ నిరంకుశ పాలనకు ప్రాలదొలి, ప్రగతిశీల లౌకిక ప్రజాస్వామ్యంతో కూడిన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని రామస్వామి అన్నారు.ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏప్రిల్ 14 నుండి మే 15 వరకు ఇంటింటికి సిపిఐ గోడపత్రికను జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి ముఖ్య అతిథులుగా హాజరై విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ (బిజెపి కో హటో దేశ్ కో బచావో )పేరుతో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రధాని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ విధానాల వలన దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను దేశ సమైక్యత సమగ్రతకు వాటిల్లే ప్రమాదాలను ప్రజలకు వివరించడం పాటు ప్రమాదకర ఫాసిస్టు నిరంకుశ హిట్లర్ తరహా పాలలను అందిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించి వామపక్ష ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్యపరిచే పాదయాత్రలను ప్రజా పోరు యాత్రలను వివిధ రూపాల్లో చేపట్టి ప్రతి గ్రామము సందర్శించాలని సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు అందరూ కార్యకర్తలు కూడా సంసిద్ధం కావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ శ్రేణులతో పాటు అన్ని రకాల కార్మిక వర్గం రైతులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రబలింగం కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. సుభాన్ రెడ్డి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మండల పార్టీ కార్యదర్శి మల్ గారి సత్తిరెడ్డి సహాయ కార్యదర్శి ఎం డి మక్బుల్ బి కే యం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ గీత పనివాళ్ల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్ ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివ ప్రధాన కార్యదర్శి డప్పు శివయ్య ఒగ్గు సత్యనారాయణ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల మాధవి విజయమ్మ సాయిలమ్మ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన పాస్టర్ మేకల ప్రసాదరావు..



తల్లాడ, ఏప్రిల్ 9 (ప్రజా పాలన న్యూస్): యేసుక్రీస్తు పునరుద్దాన పండుగ (ఈస్టర్) సందర్భంగా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో బాప్టిస్ట్ చర్చి వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కోశాధికారి పాస్టర్ మేకల ప్రసాద్ రావు ప్రారంభించారు. తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సుమారు 800 మందికిపైగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫాస్టర్ మాట్లాడుతూ యేసుక్రీస్తు మరణించి మూడోరోజు పునరుద్దానుడై లేసిన సందర్భంగా పండుగను జరుపుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు యేసుక్రీస్తు సూచించిన ప్రేమ, శాంతి మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు పాస్టర్ సుధాకర్, యెహొషువ, ఇమ్మానుయేలు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

## ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



మేడిపల్లి, ఏప్రిల్ 9 (ప్రజాపాలన ప్రతినిధి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్లో కార్పొరేటర్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రతిమ హాస్పిటల్ సౌజన్యతో"ఉచిత గుండె వైద్య శిబిరం" నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ వయస్సుతో సంబందం లేకుండ ఈ మధ్యకాలంలో గుండెపోటుతో ప్రజలు మరణిస్తున్నారని,ఈ నేపథ్యంలో డివిజన్ ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట ప్రతిమ హాస్పిటల్ సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించామని, ఈ శిబిరంలో సుమారు 250 మందికి బిపి, జి.ఆర్.బి.ఎస్, 2%ణ%- ఎకో, ఈసీజీ మొదలైన పరీక్షలను ఉచితంగా నిర్వహించామని, 9 మందికి గుండె సమస్యలను గుర్తించి మెరుగైన వైద్యం కోసం ప్రతిమ హాస్పిటల్ కు రెఫర్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వైద్య శిబిరం విజయవంతం చేసిన ప్రజలకు, సేవా దృక్పథంతో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించిన ప్రతిమ హాస్పిటల్ యజమానికి కార్పొరేటర్ సుభాష్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి కాలనీ అధ్యక్షుడు రాధాకృష్ణారావు,బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షుడు బాలరాజు,డివిజన్ జనరల్ సెక్రటరీ వర్కల శ్రీనివాస్,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బండారు మల్లేష్,ధరణి కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం,కాకతీయ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి జహంగీర్,సుదర్శన్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్,పంచవటి కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, 2వ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు శంకరాచారి,నేహా అపార్ట్మెంట్స్ అధ్యక్షుడు మల్లేష్,సీనియర్ సిటిజన్స్ మాజీ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు,డివిజన్ లోని పలు కాలనీల నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డా: బీ. ఆర్.అంబెడ్కర్ 132వ జయంతి వేడుకల కరపత్రం విడుదల



జగిత్యాల, ఏప్రిల్ 09 (ప్రజపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని ఆదివారం రోజున తహశీల్ చౌరస్తాలో డా: బీ.ఆర్. అంబెడ్కర్ విగ్రహం వద్ద అంబెడ్కర్ సంగం నాయకులు అంబేద్కర్ జన్మదిన వేడుకల కరపత్రాన్ని విడుదల చేశారు. ఏప్రిల్ 14 శుక్రవారం రోజున నిర్వహించే అంబెడ్కర్132 వ జన్మదిన వేడుకలను అంగారంగా వైభవంగా నిర్వహించాలని దళిత బడుగు బలహీన వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ దూమల రాజు కుమార్ బంద శంకర్ బాలే శంకర్ కారంగుల వసంత రావు దుమాల గంగారాం బిరుదుల లక్ష్మణ్ బోనగిరి దేవయ్య కొంగరి పవన్ ధర రమేష్ మోహన్ బొల్లి శేఖర్ దుమాల గంగారం గొడిసెల రమేష్ గంగాధర నరేష్ చిత్తరి ప్రభాకర్ కడమండ కమలాకర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుతో తెలంగాణ వైపు చూస్తున్న భారత్

**ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్**



కోరుట్ల, ఏప్రిల్ 09 ( ప్రజాపాలన ప్రతినిధి): దేశం గర్వించదగ్గ ప్రతిష్టాత్మక 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని అమహోనీయుండి జన్మదినోత్సవమైన ఏప్రిల్14 న ఆవిష్కరించనున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ ప్రజానంఘాల జేఏసీ కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నిర్మాణం అవుతున్న సమాసమజ స్వాప్నికుడు,దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహా ప్రతిమను, ప్రాంగణాన్ని సిపిఐ రాష్ట్ర నాయకులు చెన్న విశ్వనాథం, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గుగ్గిల్ల రవితో కలిసి పేట భాస్కర్ సందర్శించారు. ఈసందర్భంగా పేట భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సచివాలయానికి సైతం డా బి ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు ఇంత భారీ విగ్రహా ఏర్పాటుతో తెలంగాణ వైపు భారత దేశమంతా చూస్తుందని ఇకనైనా కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని, నిర్వీర్యం చేయాలని చూస్తున్న భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు దేశంలోని ప్రతి పౌరుడు సిద్దంగా వుండాలని పేట భాస్కర్ కోరారు. ఈ సందర్భనలో ప్రజాసంఘాల నాయకులు పి నారాయణ, ఎర్దండి సునీల్, దాసరి జగన్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్

**36. బ్రాహ్మణిజంలో భాగంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు**



**బిఎస్. రాములు**
**బీసీ కమిషన్ మాజీ చైర్మన్**

మరో మాటలో చెప్పాలంటే భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట బ్రాహ్మణిజం తన అస్థిత్వాన్ని పెంచుకుంటూ వచ్చింది. అందువల్లే జాతుల సమస్య పేరిట సాగిన సిద్ధాంత చర్చల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల జాతీయవాదాన్ని నిరాకరిస్తూ జాతీయవాదులుగా, జాతీయ అగ్రకుల పెట్టుబడిదారులుగా మధ్య తరగతిని వారి ప్రయోజనాలు మాత్రమే జాతుల సమస్యగా, జాతీయోద్యమంగా, ప్రాంతాల సమస్యగా, భాషా రాష్ట్రాల ఉద్యమాల సమస్యగా సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. సిద్ధాంతాలను బ్రాహ్మణిజం వారికి వ్యతిరేకంగా బ్రాహ్మణేతర ఉద్యమాలు వచ్చినప్పుడల్లా కొత్త రూపాల్లోకి తమ సిద్ధాంతాన్ని మార్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేస్తుంటారు. అంబేద్కర్ భాషా ప్రయుక్త రాష్ట్రాల గురించి చేసిన హెచ్చరికలు చాలామంది అర్థం చేసుకోలేదు. కాకా కాలేల్కర్ కమిషన్, మండల్ కమిషన్ సందర్భంగా ఇది గమనించవచ్చు. ఎస్సీలు, బీసీలు కలిసి ఉద్యమించాలని అంబేద్కర్ చేసిన ప్రయత్నాలను గండి కొట్టడానికై కాకా కాలేల్కర్ కమిషన్ వేసి వాయిదా వేశారు. తర్వాత నిరాకరించారు. అలాగే మండల్ కమిషన్ అమలు సందర్భంగా కమండల్, రామజన్మభూమి, బాబ్రీ మసీదు సమస్యలను, మెరిట్ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేశారు. ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారు. చివరకు అదే ఇష్యూతో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇలా చరిత్ర పొడవునా నూతనంగా ఎదుగుతున్న ప్రజల చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి బ్రాహ్మణిజం తన సిద్ధాంతాలకు కొత్తరూపం ఇచ్చి ప్యారడైమ్ షిఫ్ట్ చేస్తుంది. ముస్లింలను శత్రువులుగా చూపిస్తుంది.

**37. మతాంతరీకరణకు బ్రాహ్మణిజమే కారణం**

భారతదేశంలోని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల ముస్లింల్లో 90 శాతం ప్రజలు బ్రాహ్మణిజం ఆధిపత్య వాదాన్ని, దోపిడీని, ఆర్థిక దోపిడీని, సంస్కృతిని, అసమానతలను వ్యతిరేకిస్తూ, సామాజిక సమానత్వం కోరుతూ ఇస్లాం స్వీకరించారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి ముస్లింలను దేశద్రోహులుగా ప్రచారం చేస్తుంటారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంటారు. ఓబీసీలు హిందూ అసమానతల సంస్కృతిపై కూరుకుపోయి తమ సోదరులైన, తమకన్నా ముందు చైతన్యం పొంది ఇస్లాంలో చేరిన బీసీ, ఎస్సీలను వ్యతిరేకిస్తుంటారు. బ్రాహ్మణిజం ఇలా ప్రతీసారి ప్రతీఘాత విప్లవాన్ని విప్లవ రూపంలో ముందుకు తెస్తూ ఉంటుంది.

38. సైమన్ కమిషన్ నివేదికలో రికార్డు కానివేవీ ఆ తర్వాత జాతీయోద్యమ చరిత్రలో భాగంగా రికార్డు కాకుండా పోతున్నాయి. ఉదాహరణకు ఆంధ్రా ప్రాంతంతో సహా కలిసి ఉన్న మద్రాసు రాష్ట్రంలో పానగల్ రాజా తదితరుల నాయకత్వంలో నాన్ బ్రాహ్మిణ్ ఉద్యమం, శూద్రుల విద్య, సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. పరిపాలన సంస్కరణలు చేపట్టారు. స్కూళ్ళు పెట్టారు. అలాగే సాహు మహరాజ్ 1901లో నాన్ బ్రాహ్మిణ్ శూద్రులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. ఇవేవీ 1935 రాజ్యాంగ నిర్మాణంలో జాతీయోద్యమ చరిత్రగా రికార్డు కాలేదు. మద్రాసు ప్రావిన్సు నుంచి సైమన్ కమిషన్‌కు నివేదికలు సమర్పించలేదు. అందువల్ల ఆ చరిత్ర బ్రిటీషు ఇండియా రికార్డు చేసిన చరిత్రలో జాతీయోద్యమ చరిత్రగా రికార్డు కాకుండా పోయింది.

39. ఆ కాలంలో వందేళ్ల అడ్వాన్స్ థింకింగ్‌తో బోంబే ప్రెసిడెన్సీలో అంబేద్కర్ చేసిన చర్చలు క్రమంగా జాతీయ స్థాయికి విస్తరించాయి. సైమన్ కమిషన్‌కు నివేదికలు సమర్పించడంతోపాటు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొనడంతో పాటు అనేకసార్లు లండన్ వెళ్లి ప్రత్యేకంగా పాలకులను కలిసి నివేదికలు, చర్చలు చేయడం వల్ల అవి మొత్తం భారత జాతీయోద్యమ చరిత్రగా విస్తరించాయి. బ్రిటీష్ పాలకులు స్వీకరించారు. దానివల్ల అంబేద్కర్ కృషి దేశవ్యాప్తమైంది. ప్రపంచవ్యాప్తమైంది. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే పూనాలో చేసిన సామాజిక సంస్కరణలు విద్యారంగంలో నెలకొల్పిన పాఠశాలలు మొత్తం భారతజాతిని మేలుకొల్పినట్లుగా అంబేద్కర్ కృషి మొత్తం భారతజాతిని మేల్కొల్పింది. వారి కృషికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఎక్కడికక్కడ సంఘర్షణలు, సమర్పణలు ముందుకు సాగాయి. అందువల్ల ఆధునిక భారత సమాజ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ అని అంటున్నాము.

40. ప్రస్తుతం ఓబీసీలకు చట్టసభల్లో, సమస్త రంగాల్లో జనాభా దామాషా మేరకు ప్రాతినిధ్యం అవసరం. అందుకు ప్రొటెక్షన్, రక్షణ, రిజర్వేషన్లు అవసరం. అందుకు అనువుగా ఇంతదాకా చరిత్ర పరిణామ క్రమంలో విజయాలు సాధించిన అంబేద్కర్‌ను ఎస్సీ రిజర్వేషన్‌లను స్ఫూర్తిగా తీసుకొని వారితో కలిసి ఉద్యమించడం అవసరం. ఎప్పటిదాకా అయితే వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ సిద్ధాంతాలు, ఆచరణ వాటి వివక్ష అనేక రూపాల్లో కొనసాగుతాయో అప్పటిదాకా ఆ వర్ణాధిక్య, కులాధిక్యతా వాదుల ఆధిపత్యమే అన్ని రంగాల్లో కొనసాగుతుంది. అందువల్ల ఓబీసీలు, ఎంబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అందరు కలిసి ఆ వర్ణాధిక్య, కులాధిక్య వ్యవస్థలకు, సిద్ధాంతాలకు ఆధిక్య రూపాలకు వ్యతిరేకంగా ఉద్యమించి అన్నిరంగాల్లో తమ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు దామాషా మేరకు సాధించుకోవడం అవసరం.

**(తరువాయిభాగం రేపటి సంచికలో..)**

## డాక్టర్ వాసిరెడ్డి రామనాథంని సన్మానించిన పారుపల్లి సురేష్





మధిర, ఏప్రిల్ 9 ప్రజా పాలన ప్రతినిధి: 1982సం ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ స్థాపించిన, నాటినుండి నేటివరకు, సుదీర్ఘ కాలంగా తెలుగు దేశం పార్టీకి సేవచేసి , మధిర నియోజకవర్గ ఇన్చార్జిగా, జిల్లా పార్టీ అధ్యక్షులుగా రాష్ట్రపార్టీ ఉపాధ్యక్షులుగా నిబద్ధత కలిగిన నాయకుడుగా గుర్తింపు తెచ్చుకొని, మొన్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సన్మానించబడిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ని, ఆదివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పారుపల్లి సురేష్ , మధిరలోని ప్రజా వైద్యశాల నందు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేకూరి శేఖర్ బాబు, మల్లాది హనుమంతరావు, మైనేడి జగన్ మోహన్ రావు, రావట్ల సత్యనారాయణ, మైనీది రవి, వట్టికొండ మోహనరావు, వట్టికొండ నాగేశ్వరరావు, గడ్డం మల్లికార్జునరావు, మేడా వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## మధిర మండలంలో జోరుగా కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర

**తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి సూరంసెట్టి కిషోర్**



మధిర, ఏప్రిల్ 9 ప్రజా పాలన ప్రతినిధి: నియోజకవర్గ శాసనసభ్యులు లిమల్లు భట్టి విక్రమార్కఆదేశాలతో మధిర మండలంలో ఇల్లూరు గ్రామంలో లిహాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంసెట్టి కిషోర్ ఇంటి ఇంటికి తిరుగుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రాహుల్ గాంధీ సందేశాన్ని మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై రూపొందించిన కరపత్రాన్ని అందిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికి రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ,ఒకేసారి రైతు రుణమాఫీ రూ. 2 లక్షలు. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలకు పెంపు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ.భూమి లేని ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12వేలు. వైద్యం కోసం కుటుంబానికి సంవత్సరానికి ఉచితముగా 5 లక్షలు.ఆసరా పింఛన్లు ప్రతి అర్హులైనవారందరికీ పింఛన్లు ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే 5000రూపాయలు , ప్రతి వికలాంగులకు 4000 రూపాయలు,ఉపాధి హామీ పథకంలో పని దినాలు కుటుంబానికి 300 రోజులు మరియు రోజు వేతనం 250 తగ్గకుండా ఇవ్వడం జరుగుతుందని,పేదలకు అవసరమైన పథకాలను ప్రవేశపెడతామన్నారు..ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పత్తే పరపు సంగయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్,మండల బీసీ సెల్ అధ్యక్షుడు లిచిలివేరు బుచ్చిరామయ్యా,సేవాదల్ అధ్యక్షుడు అదురీ శ్రీను కాంగ్రెస్ నాయకులు అయిలూరి సత్యనారాయణ రెడ్డి, బిత్ర ఉద్దండయ్యా,కోట డేవిడ్,మైలవరపు చక్రి, జమిల్ పాషా, గ్రామ కాంగ్రెస్ నాయకులు పి రవిబాబు, కోటా రమేష్, మదుపల్లి రామారావు, కోట చిన్నప్ప, కోట దాసు, కోట నాగేశ్వరరావు, కోట జోగయ్య కొండ వెంకట్రావు మొదలవారు పాల్గొన్నారు.

## పునరుద్ధానుడు యేసుప్రభు: డా.కోట రాంబాబు

**ఈస్టర్ వేడుకల్లో పలు మందిరాలలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించిన డా.కోట రాంబాబు**




బోనకల్ ఏప్రిల్ 9 ప్రజా పాలన ప్రతినిధి: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో పలు మందిరాలలో ఆదివారం ప్రార్థనలు ఘనంగా జరిగాయి. మండలంలోని కలకోట గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి కల్వరి టెంపుల్ నందు జరుగుతున్న ఈస్టర్ వేడుకలకు ప్రముఖ వైద్యులు జిల్లా నాయకులు డా.కోట రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.కోట రాంబాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుప్రభు పునరుద్ధానుడు అని పాపుల కొరకు ప్రాణం అర్పించి మరలా మూడవ రోజు తిరిగి లేచిన మహనీయుడు అని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆ ప్రభు దీవెనలు ఉండాలని కోరారు. మందిరాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.కోట రాంబాబుని తెలుగు బాప్టిస్ట్ చర్చి యువత, కల్వరి టెంపుల్ పాస్టర్స్ ఘనంగా సన్మానించారు.

## రూ18 లక్షలతో ఓపెన్ జిమ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, ఏప్రిల్ 9 (ప్రజాపాలన ప్రతినిధి) : చిలకానగర్ డివిజన్లోని బాలాజీ ఎన్క్లేవ్ పార్క్ లో ఓపెన్ జిమ్ దాదాపు రూ18 లక్షల వ్యయంతో చేపట్టిన పనుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్,బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వేముల సంతోష్ రెడ్డి, చిలకానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పల్లే నరసింగరావు, ప్రధాన కార్యదర్శి కొక్కండ జగన్, నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, కొంపల్లి రవీందర్, అబ్బు బాయ్ మహబూబ్ బింగి శ్రీను, తిరుమలేష్, రాం చందర్, స్థానిక కాలనీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్, వెంకటేశ్వర్లు , జగదీశ్వర్ రెడ్డి, సిద్దేశ్వర రావు లక్ష్మీనారాయణ, సారయ్య ,కెవిన్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల12న ఐకెపి,విఓఏ,ల రౌండ్ టేబుల్ సమావేశం

**సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్**



ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 9 (ప్రజాపాలన, ప్రతినిధి) : ఈనెల 12వ తేదీన ఐకెపి,విఓఎ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడుతుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ ఐకెపి,విఓఎ, లను సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించాలని ఈనెల 17 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయడం జరుగుతుందన్నారు. కావున 12 వ తేదీ బుధవారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరై మీ అమూల్యమైన సందేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి,విఓఎ, ల జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, కోశాధికారి సునీత, మండల అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ రమ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో మండల నాయకులు

**టీపీసీసీ సభ్యులూ పైడిపల్లి కిషోర్ కుమార్,కలకోట సొసైటీ ఛైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు**



బోనకల్, ఏప్రిల్ 09 ప్రజాపాలన ప్రతినిధి: మధిర శాసనసభ్యులు సిఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చి పాదయాత్ర 22వ రోజు మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం దిబ్బపల్లి గ్రామంలో కొనసాగుతున్న పాదయాత్రలో ఆదివారం టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్,కలకోట సొసైటీ ఛైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగ కిషోర్ కుమార్, కర్నాటి కోటి ఇటీవలే కాలంలో రెండవసారి అకాల వర్షం,గాలి వానకు క్రిందపడ్డ లిమొక్కజొన్న పంటలకు కూడా విపత్తు నివారణ చర్యలు క్రింద పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని భట్టి విక్రమార్క దృష్టికి తీసుకు వెళ్లారు.సమస్యను తెలుసుకున్న విక్రమార్క స్పందిస్తూ జిల్లా కలెక్టర్ విపీ గౌతమ్ తో ఫోన్ లో మాట్లాడి రెండవ విడత ఆకాల వర్షాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారాన్ని రైతులకు అందేలా పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు భద్రు నాయక్ పాల్గొన్నారు.

## క్రైస్తవ సోదరీ సోదరీమణులకు ఈస్టర్ శుభాకాంక్షలు చావ




ఎర్రుపాలెం ఏప్రిల్ 9 ఆదివారం ప్రజా పాలన ప్రతినిధి మధిర మాజీ వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ చావా.రామకృష్ణ అరుణ దంపతులు, ఎర్రుపాలెం మండల క్రైస్తవ సోదర సోదరీమణులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈనాడు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవ సోదరులు జరుపుకునే క్రీస్తు నాథుని పునర్జన్మ రోజు. క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని నీతిమంతుడైన క్రీస్తు బోధలను అనుసరించాలని. హృదయపూర్వకంగా ఆ దేవదేవుని ఆ క్రీస్తునాధుని ఆశీస్సులు. ఆయురారోగ్యాలు ,సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను.

## టూవీలర్ మెకానిక్ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఏఎస్ఐ బాలస్వామి



బోనకల్, ఏప్రిల్ 9 ప్రజా పాలన ప్రతినిధి: మండలం లో వీలర్ మెకానిక్స్ ప్రథమ వార్షికోత్సవ%శీ% ఆదివారం బోనకలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఏఎస్ఐ బాలస్వామి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన టూవీలర్స్ మెకానిక్స్ వచ్చారు. జిల్లా టూ వీలర్స్ మెకానిక్ జిల్లా అధ్యక్షులు కొండలరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మెకానిక్స్ యూనియన్ ఆపదలో ఉన్న మెకానిక్స్ కుటుంబానికి వారికి అండగా ఆడపిల్లల పెళ్ళికి యూనియన్ తరపున 30 వేల రూపాయలు సాయం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆలీ పాషా,మధిర మండల అధ్యక్షులు సాంబిరెడ్డి ,బోనకల్ మండల అధ్యక్షులు గోగుల రామారావు, తల్లాడ మండల అధ్యక్షులు నరసింహారావు, సత్తుపల్లి మండల అధ్యక్షులు గువ్వల కృష్ణారెడ్డి ,కొనిజర్ల మండల అధ్యక్షులు పందేళ్ళ కృష్ణ, వైరా మండల అధ్యక్షులు కౌసర్ ఈ కార్యక్రమంలో మండల టూ వీలర్స్ మెకానిక్స్ పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు



లక్షటిపెట్ , ఎప్రిల్ 09, ప్రజాపాలన:మండలంలోని క్రస్తవులు ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణించి మూడురోజులకు లేచాడని ఆయన మృత్యుంజేయుడని ఆదివారం క్రస్తవులు ప్రొద్దున నాలుగు గంటలకే పట్టణంలోని సి ఎస్ ఐ చేర్చికి చేరుకొని సిల్వ దగ్గర క్యాండీల్ వెలిగించి అనంతరం సిల్వగుట్టమీద ప్రార్థనలు చేశారు ఈ సందర్భంగా చేర్చి పాస్టర్ రెవరెండ్ కరుణాకర్ రావు వచ్చిన భక్తులకు ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన సందేశాన్ని అందరికి అర్థమయే రీతిలో వివరించారు ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొని దేవుడు మరణాన్ని గెలిచి తిరిగి లేచాడు అని పాటలు పాడుచు ఆయనను స్మరించుకున్నారు.

# నేనే హీరోగా చేద్దాం అనుకున్నా..

ఈ మధ్య కాలంలో ఎక్కడ విన్నా.. ఎక్కడ చూసినా కూడా బలగం సినిమా ముచ్చట్లే వినిపిస్తున్నాయి. ప్రియదర్శి హీరోగా కావ్య కళ్యాణ్ రామ్ హీరోయిన్ గా వేణు దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని పల్లె పల్లెలో కూడా బలగం సినిమాను ప్రదర్శిస్తున్నారు. తాజాగా బలగం చిత్ర దర్శకుడు వేణు ప్రముఖ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2017 లో ఈ చిత్రం యొక్క లైన్ ను అనుకున్నాను. కథ అనుకున్నప్పటి నుండి సన్నివేశాలు డెవలప్ చేస్తూ డైలాగ్స్ రాస్తూ వచ్చాను. 2019 సంవత్సరం నాటికి కథ చాలా డెప్త్ గా రెడీ చేసుకున్నాను.. విన్న కొద్ది మంది భలే ఉందంటూ అభినందించారు.



కథ మొదలు పెట్టినప్పటి నుండి కూడా నేనే ఈ సినిమాలో హీరో పాత్ర చేయాలి అనుకున్నాను.. కానీ ఒక నిర్మాతకు కథ వినిపించిన సమయంలో ఆయన హీరోగా నువ్వు కాకుండా మరెవరైనా చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆయన మాటను నేను మొదట పట్టించుకోలేదు. ఇది నేను చేయాల్సిందే.. ఈ సినిమా కథ నాకు బాగుంటుంది.. జనాలు ఆదరిస్తారు.. నాకు బ్రేక్ వస్తుందని అనుకున్నాను. రోజులు గడిచిన కొద్ది నా ఆలోచన మార్చుకున్నాను. హీరో గా చేయాలనే నిర్ణయాన్ని మార్చుకున్నాను. బలగం సినిమాను అద్భుతంగా అందరి ముందుకు తీసుకు వెళ్లాలి అంటే పెద్ద నిర్మాత అవసరం అంటూ ఒక స్నేహితుడి సూచన మేరకు మరో స్నేహితుడి ద్వారా దిల్ రాజు గారి వద్దకు వెళ్లడం జరిగింది. కథ దిల్ రాజు గారికి నచ్చడం తో ఆరు నెలల పాటు నటీ నటుల ఎంపిక చేశాం. కథ ను దిల్ రాజు గారికి చెప్పిన సమయంలోనే కొత్త నటీ నటులతో ఈ సినిమాను చేయాలనుకుంటున్నట్లుగా చెప్పాను. స్టేజ్ ఆర్టిస్టులను ఈ సినిమా కోసం ఎంపిక చేశాం. సినిమా లో కనిపించిన ముఖ్యుల్లో కొందరు స్టేజ్ ఆర్టిస్టులు కాగా కొందరు సిరిసిల్ల ప్రాంతానికి చెందిన కొందరు. వారిని నటన రాదు.. వారి యొక్క లాంగ్ షాట్స్ ను తీసుకుని డైలాగ్స్ పెట్టామని వేణు చెప్పుకొచ్చాడు. ఈ సినిమా విజయంతో తన పై తనకు వెయ్యి రెట్లు నమ్మకం ఏర్పడిందని వేణు పేర్కొన్నాడు.

## ఐపిఎల్ టీమ్ సన్ రైజర్స్ కి నాని ప్రామిస్..!



నేచురల్ స్టార్ నాని హీరోగా, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం లో తెరకెక్కిన రా అండ్ విలేజ్ యాక్షన్ డ్రామా దసరా. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. వంద కోట్ల క్లబ్ లో చేరి నాని కెరీర్ కి మరింత ప్లస్ అయ్యింది. ఈ చిత్రం లో నాని ధరణీ పాత్రలో అదరగొట్టేశాడు. ఈ చిత్రం లో నాని బ్యాటింగ్ కి సంబంధించిన ప్రోమో ను మేకర్స్ రిలీజ్ చేశారు. అంతేకాక ధరణీ కోసం ఏదైనా కాంట్రాక్ట్ ఉందా? అంటూ ఐపిఎల్ ను ఉద్దేశించి అడగడం మాత్రమే కాకుండా, సన్ రైజర్స్ టీమ్ ఇంపాక్ట్ ప్లేయర్ కోసం ఎదురు చూస్తుందా? అని అన్నారు. బాక్సాఫీస్ వద్ద సెంచరీ కొట్టినట్లు పేర్కొన్నారు. అందుకు నాని కూడా బదులు ఇచ్చారు. ఏమంటారు సన్ రైజర్స్, ఫీల్డ్ లో చేయను అంటూ ప్రామిస్ ఇచ్చారు. ఈ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం లో దీక్షిత్ శెట్టి, సముద్ర ఖని, సాయి కుమార్, పూర్ణ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు.

## వీకెండ్ లో బాక్సాఫీస్ వద్ద కుమ్మేస్తున్న "భోళా"




బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ భోళా. తెలుగు తమిళం లో సూపర్ హిట్ అయిన ఖైదీ కి ఇది అధికార రీమేక్. ఈ చిత్రం థియేటర్ల లో విడుదల అయ్యి ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుంది. వీకెండ్ కావడం తో సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. గుడ్ ఫ్రైడే, వీకెండ్ తో ఈ చిత్రం మంచి వసూళ్లను రాబట్టింది. శనివారం మరో 3.90 కోట్ల రూపాయలను వసూలు చేయగా, ఇప్పటి వరకూ 67.39 కోట్ల రూపాయలను వసూలు చేయడం జరిగింది. ఈ చిత్రం ఆదివారం కూడా మంచి వసూళ్లను రాబట్టనుంది. అజయ్ దేవగణ్ నటించడం మాత్రమే కాకుండా, దర్శకత్వం వహించిన ఈ సినిమా లో టబు, సంజయ్ మిశ్రా, దీపక్ డొబ్రియల్, గజ్ రాజ్ రావు, వినీత్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్ర. లాంగ్ రన్ లో మరింత వసూళ్ళను రాబట్టే అవకాశం ఉంది.

# పుష్ప2 ప్రమోషన్ కోసం భారీ బడ్జెట్

సుకుమార్ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ హీరో గా తెరకెక్కుతూ ఉన్న పుష్ప 2 మూవీ షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతూ ఉంది. బన్నీ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేసి మూవీ పై అంచనాలు అమాంతం పెంచేశారు. పుష్ప 1 బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దేశ వ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ నేపథ్యంలో పుష్ప 2 అంతకు మించి అనేలా సుకుమార్ రెడీ చేస్తున్నారు. ఈ మూవీతో ఏకంగా వెయ్యి కోట్లకి పైగా కలెక్షన్స్ రాబట్టాలని టార్గెట్ గా పెట్టుకున్నారు. పుష్ప 2తో ఆర్ఆర్ఆర్ కేజీఎఫ్ 2 సరసన చేరాలని బన్నీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ మూవీ నుంచి బర్త్ డే సర్ప్రైజ్ గా టీజర్ తో పాటు ఒక పోస్టర్ ని కూడా రిలీజ్ చేశారు. కాళికాదేవి గెటప్ లో చేతిలో గన్ పట్టుకొని ఒక్క ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అంత వరకు భాగానే ఉంది. అయితే పుష్ప2 ఫస్ట్ లుక్ పోస్టర్ ని నార్త్ లో అన్ని ప్రముఖ పత్రికలలో ఫ్రంట్ పేజీ ప్రకటనగా వేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. నిజానికి ఫ్రంట్ పేజీ ప్రకటనలని కేవలం షాపింగ్ మాల్స్ లేదా ఇతర ప్రభుత్వం సంబందిత కార్యక్రమాలవై ఉంటాయి. సినిమా ప్రకటనలు పత్రికలలో ప్రచురించడం రేర్ గా జరుగుతుంది. అయితే పుష్ప టీమ్ మాత్రం సినిమాని వీలైనంత ఎక్కువగా మార్కెట్ లోకి పంపించడం కోసం ఇప్పటి నుంచే ప్రమోషన్ కోసం గట్టిగా ఖర్చు చేయడానికి డిసైడ్ అయినట్లుగా ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తుంది. రాజమౌళి ప్రీరిలీజ్ వరకు ఒక్క టీజర్ ట్రైలర్ సాంగ్స్ తోనే మూవీ పైన బజ్ క్రియేట్ చేసేవారు అప్పటి నుంచి ప్రమోషన్ కి కొంత వరకు ఖర్చు పెట్టేవారు. ఇక కేజీఎఫ్ చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ హిట్



కావడంతో చాప్టర్ 2కి ఆటోమేటిక్ గా క్రేజ్ వచ్చింది. ఆ క్రేజ్ కారణంగా ప్రమోషన్ కోసం పెద్దగా ఖర్చు పెట్టకుండానే సినిమా మార్కెట్ లోకి వెళ్ళిపోయింది. అయితే పుష్ప 2 కోసం మాత్రం మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ ప్రతిసారి కూడా బజ్ క్రియేట్ అయ్యే విధంగా చేయడానికి ప్రమోషన్ కోసం భారీగా ఖర్చు పెట్టడానికి రెడీ అయినట్లు టాక్.

# శాకుంతలం కోసం దిల్ రాజు బడా ప్లాన్



సమంత హీరోయిన్ గా నటిస్తున్న శాకుంతలం సినిమా ఏప్రిల్ 14వ తేదీన తెలుగు తమిళ కన్నడ మలయాళం హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. వాస్తవానికి ఈ సినిమా ఎప్పుడో విడుదల అవ్వాల్సి ఉంది కానీ... సినిమాని త్రీడీలో రిలీజ్ చేస్తేనే ఇంపాక్ట్ వేరేగా ఉంటుందని భావించిన దర్శక నిర్మాతలు వెంటనే దాన్ని 3డి చేయించే పనిలో పడ్డారు. ఆ త్రీడీ చేయించే పని కారణంగా అనేక వాయిదాలు పడుతూ ఎట్టకేలకు ఏప్రిల్ 14వ తేదీన రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ సినిమాలో సమంత శకుంతల అనే పాత్రలో కనిపిస్తుండగా మలయాళ నటుడు దేవ్ మోహన్ దుష్యంతుని పాత్రలో కనిపిస్తున్నాడు. దుర్వాసుడి పాత్రలో మోహన్ బాబు.. సారంగి పాత్రలో ప్రకాష్ రాజ్ మేనక పాత్రలో మధుబాల వంటి వారు ఇతర కీలక పాత్రలో నటిస్తున్నారు. నిజానికి సమంత హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా అనే పేరు తప్ప ఈ సినిమా మీద అనుకున్న స్థాయిలో బజ్ ఏర్పడలేదు. ప్రస్తుతానికి సమంత సహా సినిమా యూనిట్ అంతా కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... ఇతర రాష్ట్రాలకు చెందిన బడాబడా నగరాల్లో ప్రమోషన్స్ గట్టిగానే చేస్తున్నారు. కానీ ఎందుకో ప్రేక్షకుల్లోకి సినిమా చొచ్చుకు పోలేదనే చెప్పాలి. ఈ నేపద్యంలో దిల్ రాజు ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. అదేమిటంటే సినిమా రిలీజ్ కి ముందే ప్రీమియర్స్ వేయాలని ఈమధ్య కాలంలో బలగం రైటర్ పద్మభూషణ్ సార్ వంటి సినిమాలను రిలీజ్ కి ఒకటి రెండు మూడు రోజులు ముందే మీడియా సహా కామన్ ఆడియన్స్ కి షోలు వేసి చూపించారు. దానివల్ల మంచి మౌత్ టాక్ బయటకు వచ్చి ప్రేక్షకుల్లోకి చొచ్చుకు పోయింది. అలా ఆ మూడు సినిమాలు మంచి హిట్ టాక్ తెలుసుకోవడంతో ఈ సినిమాకి కూడా అదే పద్ధతి ఫాలో అవ్వాలని భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మీడియా ప్రతినిధులకు మూడు రోజులు ముందు సాధారణ ప్రేక్షకులకు ఒక రోజు ముందు ప్రీమియర్లు వేయాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలుపడే అవకాశం కనిపిస్తోంది.

# ఎన్టీఆర్ 30 కోసం పర్ఫెక్ట్ టైటిల్..




కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ తో తెరకెక్కుతూ ఉన్న మూవీ షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతుంది. హై వోల్టేజ్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథాంశంతో ఈ మూవీ ఉంటుందని ఇప్పటికే కొరటాల క్లారిటీ ఇచ్చారు. ఇక ఈ సినిమా కోసం హైదరాబాద్ లో భారీ పోర్ట్ సెట్ ని సాబు సిరిల్ డిజైన్ చేశారు. అలాగే ఐల్యాండ్ సెట్ ని కూడా వేసారు. ఇక్కడే ప్రస్తుతం మూవీ షూటింగ్ కొనసాగుతుంది. వచ్చే ఏడాది వేసవి నాటికి ఈ మూవీని ప్రేక్షకులకి అందించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇక మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే భారీ తారాగణం మూవీ కోసం ఎంపిక చేశారు. వారందరూ కూడా ప్రస్తుతం షూటింగ్ లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఇదిలా ఉంటే ఈ సినిమాకి అనిరుద్ మ్యూజిక్ అందిస్తూ ఉన్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో తారక్ డ్యూయల్ రోల్ లో నటిస్తున్నాడు అనే ప్రచారం నడుస్తుంది. రెండు విభిన్నమైన పాత్రలలో తారక్ కనిపిస్తాడని టాక్. అలాగే రెండు పాత్రలు కూడా రెండు టైమ్ లైన్ లో ఉంటాయని వినికిడి. ఇదిలా ఉంటే ఈ మూవీకి సంబంధించి మరో ఇంటరెస్టింగ్ న్యూస్ కూడా ఇప్పుడు తెర పైకి వచ్చింది. ఈ సినిమా కోసం పవర్ ఫుల్ టైటిల్ ని కొరటాల శివ ఇప్పటికే ఫైనల్ చేసాడని సమాచారం. అలాగే సింగిల్ లైన్ లో ఉండే విధంగా వస్తున్నా అనే టైటిల్ ని పరిశీలిస్తున్నారని ప్రచారం నడుస్తుంది. అయితే ఈ టైటిల్ పై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పవర్ ఫుల్ సబ్జెక్ట్ తో మూవీ చేస్తూ ఇలాంటి సింపుల్ టైటిల్ ని ఎలా పెడతారని తారక్ అభిమానులు ప్రశిస్తున్నారు. కేజీఎఫ్ తరహాలో టైటిల్ కూడా పవర్ ఫుల్ గా ఉండాలని కోరుకుంటున్నారు. మరి టైటిల్ పై వస్తున్న ప్రచారంలో వాస్తవం ఎంత అనేది క్లారిటీ రావాలంటే చిత్ర యూనిట్ స్పందించే వరకు వేచి చూడాలి.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA CLUB — PAY BACK TO SOCIETY
SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989